ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
గురువారం 27 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 70 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

### అమెరికాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

**చెట్టును ఢీకొన్న కారు....ముగ్గురి దుర్మరణం** 2

**నిజామాబాద్‌కు చెందిన నవీన్ ఉన్నట్లు సమాచారం**



**నిజామాబాద్,ఆగస్ట్26 (సింగిడి):** అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. మృతుడిని నిజామాబాద్‌లోని గోపన్‌పల్లికి చెందిన రాహుల్‌గా గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు కుటుంబసభ్యులకు ఈ సమాచారం అందింది.



2

### వీసా ఇంటర్వ్యూల
# నిలిపివేత

**అమెరికా మరో దుందుడుకు చర్య**



### తెలంగాణ సమ్మిట్ కోసం
# వార్ రూమ్

- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి
- ప్రజాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 – ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. 2

**హైదరాబాద్, ఆగస్ట్26 (సింగిడి)**



### 28 నుంచి ఇందిరమ్మ
# ఇళ్ల లాటరీ

2

**రోజుకు నాలుగు నియోజకవర్గాల్లో నిర్వహణ**

**హైదరాబాద్,ఆగస్ట్26 (సింగిడి):** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగం గా హైదరాబాద్ పరిధిలో నిర్మించనున్న ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ ఈ నెల 28 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

### అరవంలో అలా..
# ఆంధ్రలో ఇలా

## ఏళ్ల అనుభవానికి మళ్లీ అర్హత పరీక్ష

- తమిళనాడులో టెట్ మినహాయింపునకు తీర్మానం
- సుప్రీం ఆదేశాలతో ఏపీలో టెట్ నిర్వహణకు సిద్ధం
- అక్కడ ఊరట.. ఇక్కడ పరీక్ష

**ఒకే దేశం.. ఒకే నిబంధన.. ఒకే సమస్య.. కానీ పరిష్కారాల విషయంలో మాత్రం రెండు రాష్ట్రాలు రెండు దారులు ఎంచుకున్నాయి. సీనియర్ టీచర్లకు టెట్ తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం పరీక్ష నిర్వహణకు సిద్ధమవుతోంది. మరోవైపు తమిళనాడు అసెంబ్లీ మాత్రం సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేసింది. దీంతో ఒకచోట పరీక్షకు సన్నాహాలు.. మరోచోట మినహాయింపు కోసం తీర్మానం.. టీచర్లలో కొత్త చర్చకు దారితీస్తోంది.**

**హైదరాబాద్ బ్యూరో (సింగిడి )**



**కోర్టు ఆదేశం..**

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సర్వీసులో కొనసాగాలంటే కొందరు సీనియర్ టీచర్లు టెట్ అర్హత సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏపీలో ప్రత్యేక టెట్ నిర్వహణకు చర్యలు మొదలయ్యాయి. ఇప్పటికే విద్యాబోధనలో సంవత్సరాల అనుభవం ఉన్న వారిని మళ్లీ అర్హత పరీక్షకు హాజరుకావాల్సిన పరిస్థితి రావడంతో.. ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**మినహాయింపు తీర్మానం**

ఇదే సమయంలో తమిళనాడు అసెంబ్లీ.. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరింది. సీనియారిటీ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అక్కడి ప్రభుత్వం వాదిస్తోంది. అంటే.. కోర్టు ఆదేశాల అమలులో ఒక రాష్ట్రం ముందుకు వెళ్తుంటే.. మరో రాష్ట్రం మినహాయింపు కోసం కేంద్రం తలుపు తడుతోంది.

**అనుభవానికి పరీక్షా?**

దశాబ్దాలుగా విద్యార్థులకు బోధిస్తున్న టీచర్లను మళ్లీ అర్హత పరీక్ష రాయించడం ...మిగతా 2లో



### కాంగ్రెస్ రాజకీయాల్లో
# ఉత్కంఠ

## భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ

- మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు
- సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి

2

కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండా మురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు.

**హైదరాబాద్,ఆగస్ట్26 (సింగిడి)**

### జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్
# తొలి ఎంపిక

## మంత్రి శ్రీధర్‌బాబు



2

**హైదరాబాద్, ఆగస్ట్26 (సింగిడి):** ప్రపంచస్థాయి కంపెనీలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు తొలి ఎంపికగా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గతేడాది రాష్ట్రంలోకి 75 జీసీసీలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది నాటికి మరో 100 సెంటర్లను తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.



### జోరుగా ఇంటింటికీ
# తెలుగుదేశం

## ఒక్కరోజే 2.31 లక్షల ఇళ్లకు!

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. బుధవారంతో ఈ కార్యక్రమం 31వ రోజు పూర్తి చేసుకుంది.

**- అమరావతి, ఆగస్ట్26 (సింగిడి)**

### రేవంత్ ప్రభుత్వం
# భూ అమ్మకాలతో బిజీ

## భూకబ్జాలతో హైదరాబాద్ బ్రాండ్ కు దెబ్బ

**22ఎను వెంటనే తొలగించాలి.. లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం**

**బిఆర్‌ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**



కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. 2

**హైదరాబాద్, ఆగస్ట్26 (సింగిడి)**



### ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు
# అత్యధిక ప్రాధాన్యం

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

**కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ**

**వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం చంద్రబాబు**

**అమరావతి, ఆగస్ట్ 26 (ఆర్ఎన్ఏ):** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. 2



### అమెరికా, కెనడా మధ్య
# వాణిజ్య యుద్ధం

**అగ్రరాజ్యంపై ప్రతీకార సుంకాలు విధించిన కెనెడా** 2

అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమవుతోంది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్ర రాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించింది. 27.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన.. 700లకు పైగా అమెరికా వస్తువులపై టారిఫ్‌లు విధిస్తున్నట్లు ఆ దేశ పరిశ్రమల శాఖ మంత్రి ఫ్రాంకోయిస్-ఫిలిప్ షాంపేన్ ప్రకటించారు.

**కెనడా, ఆగస్ట్26 (సింగిడి)**



2

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

## 105 మంది భారతీయులు సహా వందలాది మంది గల్లంతు

నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టన పెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి.

**- ఖాట్మండ్ ఆగస్ట్26 (సింగిడి)**

# ఘోర బస్సు ప్రమాదం

## కోదాడ వద్ద ఆగివున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

**ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం**

**మృతులంతా ఎపికి చెందిన వారిగా గుర్తింపు** 2

**ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్**

**తక్షణ సహాయక చర్యలకు ఆదేశం**

**సూర్యాపేట,ఆగస్ట్26 (సింగిడి):** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది.




**మంత్రుల దిగ్భ్రాంతి**

- అధికారులతో ఆరా తీసిన పవన్ కళ్యాణ్
- క్షతగాత్రకుల మెరుగైన వైద్యం అందించాలన్న మంత్రి లోకేశ్
- భద్రతా ప్రమాణాలపై మండిపల్లి సమీక్ష

2



### ఏడుగురు
# మత్స్యకారులు క్షేమం

- పశ్చిమ బెంగాల్‌లో ఉన్నట్లు నిర్ధారణ
- బోటు ఎలా తప్పిపోయింది ఏ మార్గంలో వెళ్లింది అన్ని కోణాల్లో పరిశీలన
- మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో కుటుంబాల్లో ఊరట
- మత్స్యకారుల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత: మంత్రి అచ్చెన్నాయుడు

2

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 27 ఆగస్టు 2026

### తెలంగాణ సమ్మిట్ కోసం
## వార్ రూమ్

బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజరు జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## అమెరికా ఘోర రోడ్డు ప్రమాదం

ఉన్నత చదువుల కోసం మూడు నెలల క్రితం అమెరికా వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు హరిబాబు, నాగమణి కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారని తెలుస్తోంది.. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం రాత్రి మొత్తం ముగ్గురు స్నేహితులు కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారు చెట్టును ఢకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందినట్లు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన యువకుడు ఇలా అనూహ్యంగా మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాహుల్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ

ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22–ఏ నిషేధిత జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22–ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22–ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22–ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుమాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్దాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22 ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు. సెక్షన్ 22ఏ పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే అని స్పష్టం చేశారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. మీ తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. మీరే చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని అడిగారు. తప్పు చేసింది మీరు.. సరిదిద్దుకోవాల్సింది కూడా మీరేనని పునరుద్ఘాటించారు. ప్రజల నుంచి 30 శాతం కమిషన్లు గుంజుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి బ్రోకర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏజెంట్లు కాలనీల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలు ఒక్క రూపాయి కూడా బ్రోకర్లకు ఇవ్వద్దని సూచించారు. మీ ఆస్తులను కాపాడి మీకు అప్పగించే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ మొదలవుతుందని తెలిపారు. అసెంబ్లీలో సెక్షన్ 22ఏపై పోరాడతామని పేర్కొన్నారు. కబ్జాదారులే ధర్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెడలు వంచి మీకు న్యాయం చేసే బాధ్యత మాపై ఉందని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## అమెరికా, కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

25 శాతం సుంకాలు ఉన్న వస్తువుల్లో గృహోపకరణాలు, జున్ను వంటి పాల ఉత్పత్తులు, చేపలు, సముద్రపు ఆహారం వంటివి ఉన్నాయి. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులతో పాటు ఫర్నిచర్, వస్త్రాలకు అత్యధికంగా 50 శాతం సుంకాలు అమల్లోకి రానున్నాయి. మరికొన్ని వస్తువులు, ఉత్పత్తులపై 15, 25 శాతం చొప్పున ప్రతిసుంకాలు విధించింది. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోవెహాటివ విడిభాగాలు ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ తాజా ప్రకటన వెలువడింది. అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలతో పాటు, దేశీయ వ్యాపారాలు, కార్మికుల కోసం కెనడా 7.5 బిలియన్ కెనడియన్ డాలర్లతో సహాయ ప్యాకేజీని ప్రకటించింది. 'అమెరికా ప్రతిపాదించిన కొత్త నిబంధనలు కెనడా ప్రయోజనాలకు అనుకూలంగా లేవు. కెనడా నుంచి ఎక్కువ ఆశిస్తున్న అగ్రరాజ్యం.. ప్రతిఫలంగా మాకు చాలా తక్కువ వనరులను ఇస్తోంది. అందువల్లే మా కార్మికులు, వ్యాపారాలు, వ్యూహాత్మక రంగాలు.. జాతీయ ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేందుకు ఆ దేశంతో చర్చలు నిలివేశాం' అని కెనడా ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# ఘోర బస్సు ప్రమాదం




ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేల్రప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లకిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

## మంత్రుల దిగ్భ్రాంతి

**అమరావతి,ఆగస్ట్26 (సింగిడి):** సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఏపీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు.

# అరవంలో అలా.. ఆంధ్రలో ఇలా

మొదటి పేజీ తరువాయి

ఎంతవరకు సమంజసం? అన్న ప్రశ్న ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తోంది. తరగతి గదిలో అనుభవం, బోధనా నైపుణ్యం కూడా అర్హతకు కొలమానాలేనని వారు చెబుతున్నారు. మరోవైపు విద్యా ప్రమాణాలను నిర్ధారించేందుకు టెట్ అవసరమన్న వాదన కూడా ఉంది.

**రెండు రాష్ట్రాలు.. రెండు దారులు**

ఇక్కడే అసలు చర్చ మొదలవుతోంది. ఒకే న్యాయపరమైన అంశం.. ఒకే తరహా ఉపాధ్యాయ వర్గం.. కానీ అమలు విషయంలో మాత్రం భిన్నమైన అడుగులు. ఏపీలో పరీక్ష దిశగా కదులుతుంటే.. తమిళనాడు మినహాయింపు కోరుతోంది. దీంతో సీనియర్ టీచర్లకు ఒకే నిబంధన ఉన్నప్పుడు.. పరిష్కార మార్గాలు ఎందుకు వేర్వేరుగా ఉండాలన్న ప్రశ్న కూడా తెరపైకి వస్తోంది.

**కేంద్రం ఏం చేస్తుంది?**

ఒకవైపు సుప్రీంకోర్టు ఆదేశాలు.. మరోవైపు రాష్ట్రాల భిన్న వైఖరి.. ఇంకోవైపు సీనియర్ టీచర్ల అభ్యంతరాలు. ఇప్పుడు కేంద్రం తీసుకునే నిర్ణయంపైనే అందరి దృష్టి ఉంది. తమిళనాడు తీర్మానాన్ని కేంద్రం ఎలా పరిగణిస్తుంది? సీనియర్ టీచర్లకు మినహాయింపు విషయంలో ఏదైనా స్పష్టత వస్తుందా? ఏపీలో టెట్ ప్రక్రియ ఎలా ముందుకు సాగుతుంది? అన్నదే కీలకంగా మారింది. ఒకచోట పరీక్ష.. మరోచోట మినహాయింపు.. ఒకే సమస్యకు రెండు పరిష్కారాలు. మరి సీనియర్ టీచర్లకు చివరికి దక్కేది పరీక్షా?.. ఊరటా?

## కాంగ్రెస్ రాజకీయాల్లో ఉత్కంఠ

తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ప్లాన్ ఏ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ప్లాన్ –బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను' అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

### ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు
## అత్యధిక ప్రాధాన్యం

క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు

## నేపాల్‌లో ఆకస్మిక వరదలు

ఈ నేపథ్యంలో నేపాల్‌కు దిగువన ఉన్న బిహార్, యూపీ రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మరోవైపు, ఈ అకస్మిక వరదలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఆకస్మిక వరదలు కేవలం గంటల వ్యవధిలోనే విరుచుకుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో కుండపోత వర్షం కురిసినా, లేదా నదీప్రవాహానికి అడ్డుగా ఉండే కొండచరియలు విరిగి పడిన సందర్భాల్లో కూడా ఆకస్మిక వరదుల దిగువన ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతాయి. కొండల్లోని మంచు కరగడంతో ఏర్పడే గ్లేషియల్ సరస్సులు అస్థిరమై ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చిన సందర్భాల్లో కూడా లోతట్టు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తుతాయి. అంతెత్తున ఉండే కొండల నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి తన దారిలో ఉన్న అన్ని నిర్మాణాలను నేలమట్టం చేయగల శక్తి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, రసువా జిల్లాలో వర్షాలకు అవకాశం తక్కువని అక్కడి వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. కానీ నేపాల్‌కు ఎగువన ఉన్న టిబెట్‌లో భారీ వర్షం కురిసిన విషయం శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై తమను ముందస్తుగా హెచ్చరించడంలో చైనా విఫలమైందని ఇప్పటికే నేపాల్ జర్నలిస్టు ఒకరు నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాలయాల్లో ఉన్న నేపాల్‌లో భారీ పర్వతాలు, వాటి నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నదులతో ఎల్లప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలంలో కురిసే వర్షాల కారణంగా కొండ కోనల్లో పోటెత్తే వరదలు చూస్తుండగానే మహోగ్రరూపం దాలుస్తాయి. ఇది చాలదన్నట్టు వాతావరణ మార్పులు పరిస్థితులను మరింత జటిలం చేస్తున్నాయి. భూతాపం పెరుగుతుండటంతో నేపాల్‌లోని కొండలపై మంచు కరిగిపోతోంది. హిమనదాలు కనుమరుగు అవుతున్నాయి. ఫలితంగా కొండలపై భారీ గ్లేషియల్ సరస్సులు ఏర్పడుతున్నాయి. కొండిపాంతాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో కొండ చరియుల విరిగిపడ్డా లేక కాస్త ఎక్కువ వర్షం కురిసినా సరస్సులు కట్టలు తెంచుకుని దిగువనున్న ప్రాంతాలను ముంచెత్తే అవకావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నేపాల్‌లో భారీ వర్షాలు అలజడి సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదలు ఊళ్లను ముంచెత్తుతున్నాయి. ఉద్ధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది.

## 28 నుంచి ఇందిరమ్మ ఇళ్ల లాటరీ

ప్రతి రోజూ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు చొప్పున 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు ఈ పక్రియను చేపట్టనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు. ఈ లాటరీ పక్రియ నంతటినీ యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, ఎటువంటి అనుమానాలు, అపోహలకు తావివ్వకుండా పూర్తి పారదర్శకంగా లాటరీ డ్రా తీసేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థలాభావం భద్రతా ఏర్పాట్లు తదితర కారణాల వలన లాటరీ కేంద్రాల్లోకి దరఖాస్తు దారులందరినీ అనుమతించలేమని, అయితే, ఆయా కేంద్రాల వద్ద లాటరీ జరుగుతున్న తీరును ప్రజలందరూ స్క్రీన్లపై వీక్షంచేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లాటరీ పక్రియ ప్రత్యక్ష ప్రసారాన్ని వెబ్ సైట్ లోనూ హౌసింగ్ డిపార్ట్ మెంట్ సోషల్ మీడియా హ్యాండిల్స్ బిణరట.నౌతిఇతిజీ తో ఉన్న ఫేస్ బుక, ఇన్ స్టా గ్రామ్ ల ద్వారా చూడవచ్చని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకం కింద ఇండ్లు కావాలనుకునే వారి నుంచి ఈ నెల 15 వరకు దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. వచ్చిన దరఖాస్తులన్నిటినీ పరిశీలించడమే కాకుండా, అనర్హులుగా గుర్తించిన వారి నుంచి అభ్యంతరాలను కూడా తీసుకుని పరిష్కరించినట్లుగా వైస్ ఛైర్మన్ వి పి గౌతం తెలిపారు.

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం

**అమరావతి, ఆగస్టు 26 (సింగిడి)**

కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ నెల 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు.మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చన్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు.

### వీసా ఇంటర్వ్యూల
## నిలిపివేత

**అమెరికా మరో దుందుడుకు చర్య**

**వాషింగ్టన్,ఆగస్ట్26 (సింగిడి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్ మెంట్లను అర్థంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్డ్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రీషెడ్యూలింగ్ సమయం గురించి త్వరలో తెలియజేయనున్నారు. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణా కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.

### జోరుగా ఇంటింటికీ
## తెలుగుదేశం

రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. బుధవారం ఒక్కరోజే 2,31,918 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 86.24 లక్షల కుటుంబాలను పార్టీ శ్రేణులు నేరుగా కలిశాయని టీడీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ప్రతి గడపకూ వెళ్లి, ఆయా కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాను, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సూచనలు, అభిప్రాయాలను నేరుగా స్వీకరిస్తున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతోందని టీడీపీ నేతలు తెలిపారు. అనేక ప్రాంతాల్లో ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటూ తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా భాగస్వామ్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది.

### జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్
## తొలి ఎంపిక

ఆక్టేవ్ ఇంటెలిజెన్స్ సంస్థ హైటెక్ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. నగరంలో కేవలం ఐటీ మాత్రమే కాకుండా స్పోర్ట్స్ టెక్నాలజీ, మీడియా, హాస్పిటాలిటీ, క్యాపిటల్ మార్కెట్స్, ట్రేడింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాలకు చెందిన కంపెనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. ఆక్టేవ్ సీఈవో మటియాస్ స్టెన్‌బర్గ్ మాట్లాడుతూ.. తమ సంస్థ తదుపరి వృద్ధి దశను కొనసాగించడానికి హైదరాబాద్ అన్నివిధాలా అనువైన ప్రదేశం అన్నారు. ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ ప్రతిభ, శక్తివంతమైన టెక్నాలజీ ఎకో సిస్టమ్, బలమైన ఆవిష్కరణల సంస్కృతి.. హైదరాబాద్ సొంతమన్నారు. ఆక్టేవ్ ఇండియా ప్రొడక్ట్ అండ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొనిదెన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ సెంటర్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్, ఏఐ, డేటా, క్లౌడ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అంశాల్లో సేవలు, ఆవిష్కరణలు ఉంటాయన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగుా ఓ నిజం Singidi గురువారం 27-8-2026

# 22-ఏ రద్దు కోసం జెన్ జీ తరహా ఉద్యమం




- ప్రభుత్వం మెడలు వంచి ప్రజల ఆస్తులను కాపాడుతాం
- ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం
- తప్పు చేశారు రద్దుచేసి పాపాన్ని కడుక్కోండి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**కూకట్ పల్లి, ఆగస్టు 26 (సింగిడి):** 22-ఏ ను రద్దు చేయకుంటే ఢిల్లీ జెన్ జీ తరహా ప్రత్యక్ష ఉద్యమం చేపడుతామని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 22-ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గం ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్ లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 22-ఏ తీసుకువచ్చి ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధ జాబితాలో పెట్టి ప్రభుత్వమే కబ్జాదారుగా మారిందని విమర్శించారు. ప్రజల ఆస్తులు లాక్కుంటున్న ప్రభుత్వం ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని ఎత్తివేస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు 22-ఏ తీసుకువచ్చారని గుర్తు చేశారు. దీని ప్రకారం 2008 కి ముందు ఉన్న చట్టాన్ని అమలు చేస్తూ ప్రజల ఆస్తులను యుఎల్సీ పరిధిలోకి తీసుకురావడం సుప్రీంకోర్టు నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లే అవుతుందని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలోని భూములను తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు చేశారని, రేవంత్ రెడ్డి పాలనలో 30 వేల కోట్ల విలువ చేసే భూములను అమ్ముకున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని 59 పాలిటెక్నిక్ కళాశాల భూములు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో భవిష్యత్ తరాలకు బొంద పెట్టుకోవడానికి కూడా స్థలం లేకుండా విక్రయాలు చేపడుతున్నారని దుయ్యబట్టారు. 22-ఏ నిషేధిత జాబితా నుండి 98 శాతం భూములు తీసేశామని, క్షమాపణలు చెబుతున్న రెవెన్యూ శాఖ మంత్రి మొత్తం ఈ చట్టాన్ని ఎందుకు తీసివేయడం లేదని ప్రశ్నించారు. హత్య చేసి సారీ చెప్తే సరిపోతుందా అని ఎద్దేవా చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది ప్రజలు సమస్య ఎదుర్కొంటున్నారని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తప్పులు ఒప్పుకొని ఇంకా అలాగే ఉంచడం వల్ల సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లకు చెందిన బ్రోకర్లు రంగంలోకి దిగారని అన్నారు. నిషేధిత ఆస్తిలోని 30 శాతం తమకు ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ప్రజలను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలపై బాంబులు వేస్తామన్న పొంగులేటి ప్రజల పైన 22-ఏ బాంబు వేశారని ఎద్దేవా చేశారు. తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని చెప్పిన ముఖ్యమంత్రి ప్రజల ఆస్తులతో రియల్ ఎస్టేట్ చేయడం సరైనది కాదని అన్నారు. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూములను 50 శాతానికి తెగనమ్మి లక్షలాది మంది ఉపాధిని కొల్లగొడుతుంది అన్నారు. తద్వారా కాంగ్రెస్ పెద్దలు లక్షల కోట్ల కుంభకోణం చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ని పెంచి ప్రజల ఆస్తుల ధరలను పెరిగేటట్లు చేశారన్నారు. కానీ రేవంత్ తుగ్లక్ నిర్ణయాల వల్ల పెట్టుబడులు రావడం లేదన్నారు. ఒకవైపు హైడ్రా, మరోవైపు 22-ఏ వల్ల హైదరాబాద్ ప్రజలకు కంటి నిండా నిద్రపట్టే పరిస్థితి లేదన్నారు. తమ ప్రభుత్వంలో 450 కోట్లు వెచ్చించి కూకట్ పల్లి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించామని, ఎంపీగా గెలిపించి రాజకీయ పునర్జన్మ కల్పించిన కూకట్ పల్లి ప్రజలకు ముఖ్యమంత్రి 22-ఏ ద్వారా తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ బ్రోకర్లకు ఎవరు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. భేషరతుగా సెప్టెంబర్ 7వ తేదీలోగా 22 ఏను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తెలిసిన పార్టీగా అసెంబ్లీని స్తంభింపజేసి, సెక్రటేరియట్ ను ముట్టడించి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని స్పష్టం చేశారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 40 నుండి 50 ఎకరాల హౌసింగ్ బోర్డ్ స్థలాలను ప్రజలకు అంకితం చేశామని, వాటన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కలవలేదని తనపై కోపంతో నియోజకవర్గ ప్రజలకు రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాన్ని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో వచ్చేటట్లుగా విడదీసి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించారన్నారు. తనపై కోపం ఉంటే తనను చంపాలని అంతేకానీ ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, పగడాల బాబురావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావును కలిసిన భారతీయ పోస్టల్ ఉద్యోగుల సంఘాల నాయకులు



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 26 (సింగిడి):** భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ మరియు బి జి డి కే ఎస్ యూనియన్ నాయకులు బుధవారం లోక్‌సభ సభ్యులు ఎం. రఘునందన్ రావు ని వారి నివాసంలో కలిసి పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయడానికి చేసిన కృషికి యూనియన్ నాయకులు రఘునందన్ రావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు వల్ల జిల్లా ప్రజలు పాస్‌పోర్ట్ సంబంధిత సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం తగ్గి, ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అలాగే, తెలంగాణ సర్కిల్‌లో పోస్టల్ డివిజన్ల పునర్వ్యవస్థీకరణతో పాటు వరంగల్ రీజియన్ ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని మరో ముగ్గురు ఎంపీలతో కలిసి ప్రతిపాదన సమర్పించినందుకు కూడా యూనియన్ ప్రతినిధులు గౌరవ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రధానంగా గ్రామీణ్ డాక్ సేవకులను (జీడీస్) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలనే అంశాన్ని గౌరవ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. యూనియన్ ప్రతినిధులు వివరించిన సమస్యలను గౌరవ ఎంపీ శ్రద్ధగా విని, ఈ అంశాన్ని గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దృష్టికి తప్పకుండా తీసుకువెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, సంగారెడ్డి పోస్టల్ డివిజన్ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను కూడా యూనియన్ నాయకులు గౌరవ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని ముత్తంగి, ఐడిఏ పాశమైలారం, ఐ డి ఏ బొల్లారం, తెల్లాపూర్ మరియు అమీన్‌పూర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అధిక హెచ్ ఆర్ ఎ మంజూరు చేయాలని వారు కోరారు. సంగారెడ్డిలో పోస్టల్ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో పోస్టల్ ఉద్యోగుల కోసం స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించాలని కూడా యూనియన్ ప్రతినిధులు గౌరవ ఎంపీని కోరారు. ఉద్యోగులకు నివాస సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, సంగారెడ్డి హెడ్ పోస్టాఫీస్‌ను దేశంలోని మోడల్ పోస్టాఫీసుల్లో ఒకటిగా అభివృద్ధి చేయనున్నట్లు గౌరవ ఎంపీ తెలిపారు. అలాగే కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి శ్రీ పెమ్మసాని చంద్రశేఖర్ గారు త్వరలో సంగారెడ్డి పోస్టాఫీసును సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులు మరియు యూనియన్లు ప్రస్తావించిన సమస్యలను ఓపికగా విని, వాటిని సంబంధిత స్థాయిలో పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినందుకు యూనియన్ నాయకులు ఎంపీ కి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు మరియు ప్రతినిధులు బి. శశిధర్, అధ్యక్షులు, పి. పరమేశ్వర్, డివిజనల్ సెక్రటరీ, రామావత్ సురేష్, డిప్యూటీ సెక్రటరీ, వై. రాజేంద్ర కుమార్, డివిజనల్ సెక్రటరీ, బి జి డి కె ఎస్, రవీందర్, డిప్యూటీ సెక్రటరీ, బి జి డి కె ఎస్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన స్పీకర్





**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 26(సింగిడి):** వికారాబాద్ జిల్లా పరిధిలోని మోమిన్ పేట మండలం రాంనాథ్ గుడుపల్లి, మర్పల్లి మండలం తుమ్మలపల్లిలో లబ్ధిదారురాలు పద్మామహేష్, జ్యోతి పాండు లకు చెందిన ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం పూర్తికావడంతో ఆయన సాంప్రదాయబద్ధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, స్థానిక నాయకులతో కలసి స్థానిక ఇళ్ళను ప్రాంభించారు. లబ్దిదారులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా లబ్దిదారులు కూడా స్పీకర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటినుండి నేటి వరకు నిరుపేదలకు పక్కా గృహాలను నిర్మింపచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. నాడు స్వర్గీయ ప్రధాని ఆయాంలో బలహీనవర్గాలకు ఇళ్ళ స్థలాలు, పక్కా ఇళ్ళు మంజూరీ చేసి నీడను కల్పించినట్లు ఆయన చెప్పారు. నేడు గ్రామీణ ప్రాతాంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణాలల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండలంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పర్యటన



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 26 (సింగిడి):** కొండాపూర్ మండలంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గొల్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బల్జగూడెం నాగేష్ కుమార్తె ఇటీవల వివాహం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం మల్లేపల్లి గ్రామంలో రామప్ప తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే తోగార్పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రవి తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పి, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ప్రేమానందం, ప్రభాకర్ రెడ్డి, బాల గౌడ్, రామప్ప, మానెయ్య, సతీష్, రవి, బుచ్చయ్య యాదవ్, మామిళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడా మేస్త్రి నగర్ డివిజన్‌లో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరు కులమతాలకతీతంగా మతసామరస్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు,ముస్లిం మైనార్టీ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో జె. మహేందర్ ప్యానల్ ఘనవిజయం

- అభినందించిన వడ్డేపల్లి



**కూకట్‌పల్లి, ఆగస్టు 26 (సింగిడి):** మూసాపేట్ ఆంజనేయ నగర్ రెసిడెన్స్ ఎన్నికల్లో జె. మహేందర్ ప్యానల్ ఘనవిజయం సాధించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పాలకవర్గ సభ్యులు ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన జె. మహేందర్ ప్యానెల్ సభ్యులందరినీ వడ్డేపల్లి రాజేశ్వర రావు ఘనంగా సన్మానించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ నగర్ రెసిడెన్స్ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, కాలనీవాసుల సంక్షేమం కోసం నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలోనూ తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సమావేశంలో భాగంగా కాలనీ సభ్యులు భద్రతాపరమైన అంశాలను ప్రస్తావిస్తూ కాలనీలో మరింత పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు కాలనీవాసుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, అవసరమైన ప్రాంతాల్లో నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించేందుకు ముందుకు వచ్చారు. అంతేకాకుండా, ఇందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని కూడా వెంటనే వారికి అందజేశారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం కాలనీవాసుల నమ్మకాన్ని ఎల్లవేళలా నిలబెట్టుకుంటూ, అందరి సహకారంతో ఆంజనేయ నగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శేఖర్ గుప్తా, జె. మహేందర్ ప్యానల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల జోలికెళ్తే బంగారు భవిష్యత్ చిత్తు

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్ట్ 26 (సింగిడి):** మత్తు పదార్థాల వినియోగంలో 25 ఏళ్లలోపు దేశ యువతనే అధికంగా ఉండడం ఆందోళన కలిగించే అంశం. మత్తు పదార్థాల వినియోగంపై యువతకు అవగాహన కలిగించేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, హోమ్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నశా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం ప్రచార పోస్టర్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు మత్తు పదార్థాల వినియోగముకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమై చేజేతులా వారి బంగారు భవిష్యత్తును వారే నాశనం చేసుకున్న వాళ్లు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ యోగిని బీకె. జ్యోతి బహన్ జి, ఎస్ఆర్ నగర్ ఇంచార్జ్ బీకే. మంజుల, బీకే.నాందేవ్, బీకే.నరేందర్ యువకులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మండలం కోతేరపల్లి ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 26(సింగిడి):** ఏమ్మార్పీఎస్ వికారాబాద్ మండల ఇంచార్జ్ చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్ మండలం కొత్రేపల్లి ఏమ్మార్పీఎస్ గ్రామకమీటిని ఎన్నుకోవడం జరిగింది. వికారాబాద్ మండల అధ్యక్షుడు నగరం ప్రవీణ్ కుమార్ మాదిగ, వికారాబాద్ ఎమ్మెస్పీ మండల అధ్యక్షులు యాదగిరి మాదిగ, వికారాబాద్ మండల సలహా దారులు రాంచంద్రయ్య మాదిగ, ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బక్క నర్సిములు మాదిగ, అధికార ప్రతినిధి శేఖర్ మాదిగ, ఉపాధ్యక్షుడు సుధాకర్ మాదిగ, ఎన్నుకోగా కార్యవర్గ సభ్యులుగా అనిల్ మాదిగ, రాజు మాదిగ, సురేష్ మాదిగ, నాగరాజు మాదిగ, లోకేష్ మాదిగ, ప్రవీణ్ మాదిగ శ్రీనివాస్, మాదిగ అనిల్, కుమార్ మాదిగ, యాదయ్య మాదిగ, శ్రీనివాస్ మాదిగ, సలహా దారులుగా రాంచంద్రయ్య మాదిగ, పి రాంచంద్రయ్య మాదిగ, నగేష్ మాదిగ లు వ్యవహరించనున్నారు.

## స్మార్ట్ ఫోన్ సైబర్ సెక్యూరిటీపై పరిశోధనకు పీహెచ్.డీ



**పటాన్చెరు, ఆగస్టు 26(సింగిడి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి కోక విజయ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'స్మార్ట్ ఫోన్లలో ఇన్ స్టాలేషన్ అనంతర సైబర్ దాడులను గుర్తించి, వాటి ప్రభావాన్ని తగ్గించే అనుకూల వ్యవస్థ'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. కిరీట్ ముప్పవరం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, అప్లికేషన్ ఇన్ స్టాలేషన్ తరువాత తలెత్తే కొత్త ముప్పుల నుంచి ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ భద్రతను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుందని తెలియజేశారు. ఈ పరిశోధన, నకిలీ అప్లికేషన్లు, మ్యాన్-ఇన్-ది-డిస్క్ దాడులు, రీప్యాకేజింగ్, ప్రివిలేజ్ ఎస్కలేషన్, యూఐ స్పూఫింగ్ వంటి ముప్పులను నిజ సమయంలో గుర్తించడానికి, ప్రవర్తనా పర్యవేక్షణ, మెషిన్ లెర్నింగ్, రిస్క్-ఆధారిత ప్రతిస్పందన యంత్రాంగాలను మిళితం చేసే ఒక అనుకూల భద్రతా ఫ్రేమ్ వర్కును అభివృద్ధి చేసిందన్నారు. ప్రతిపాదిత పద్ధతులు నకిలీ-యాప్ గుర్తింపులో 95.83 శాతం ఖచ్చితత్వాన్ని, వీటిణ దాడి గుర్తింపులో 97.33 శాతం ఖచ్చితత్వాన్ని సాధించగా, డైనమిక్ సెక్యూరిటీ అసెస్ మెంట్ ఫ్రేమ్ వర్కు 94.7 శాతం గుర్తింపు ఖచ్చితత్వాన్ని నమోదు చేసి, ఇన్ స్టాలేషన్ తరువాత జరిగే విజయవంతమైన దాడులను గణనీయంగా తగ్గించినట్టు వివరించారు. ఈ పరిశోధనను బెంచ్ మార్క్ డేటాసెట్లను ఉపయోగించి ధృవీకరించారని, ఇది కనిష్ట వనరుల వినియోగంతో మెరుగైన దాడి నివారణను ప్రదర్శించి, వనరుల కొరత ఉన్న స్మార్ట్ ఫోన్లలో ఆచరణాత్మక వినియోగానికి దాని సామర్థ్యాన్ని ప్రస్ఫుటీకరిస్తోందన్నారు. డాక్టర్ విజయ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎడిటోరియల్

Editorial


## ఆర్థికపతనం దిశగా.. అమెరికా ఫస్ట్ నినాదం!

ఇరాన్‌తో జరిగిన యుద్ధం, అంతర్జాతీయంగా వివిధ దేశాలతో అనుసరిస్తున్న విధానా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల సామాన్య పౌరులను చికాకు పెట్టిస్తోంది. ఇప్పటికే అక్కడ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యాసవర ధరలు కూడా పెరిగాయి. ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా ఓ రకంగా చతికిలపడిందనే చెప్పాలి. ఈ అనుభవం రష్యాకు కూడా వచ్చింది. ఉక్రెయిన్‌పై దాడులు రష్యానూ దెబ్బతీసాయి. యుద్ధాలతో విజయం దక్కకపోగా... ఆర్థిక రంగంలో వైఫల్యాలలు తీవ్రమవుతున్నాయి. దేశంలో సగటు పౌరులు ట్రంప్‌ను ఎన్నుకున్నందుకు బాధ పడుతున్నారు. ప్రపంచంతో సక్రమమైన సంబంధాలు కోల్పోవడంతో వారు అనేక రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారు. వలసలపై ఆంక్షలు, ప్రపంచ దేశాలపై విచక్షణారహిత సుంకాల సమరం అమెరికాను అన్ని విధాల దెబ్బతీస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలలోను, అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ అభ్యుదయానికి కాకుండా అరాచకానికి ట్రంప్ కారకుడు అవుతున్నారు. భారత్ సహా వర్థమాన దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం అంచుకు చేరుతున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా అమెరికాను కూడా ముంచుతున్నాయి. అయినా ట్రంప్ ఇవేవీ గమనించడం లేదు. వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లుతున్న అమెరికా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తుందా అనుమానాలు బయలుదేరాయి. లేక కొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న విషయమిది. అమెరికాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది వేరుగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. నిరంతర యుద్ధ వ్యయాలు, సంపన్న వర్గాలకు పెద్ద ఎత్తున పన్ను కోతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల మూలంగా తీవ్రమవుతున్న ఇంధన, సరఫరాల సంక్షోభాలు కూడా తోడయ్యాయి. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ప్రాబల్యం తగ్గడం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య విధానాలు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్నాయి. ఫలితంగా అమెరికా జాతీయ రుణం ఆ దేశ స్థూల దేశీయోత్పత్తిలో 126 శాతంగా ఉన్నది. పోటీదారు అయిన చైనా జాతీయ రుణం జీడీపీలో 83 శాతంగా మాత్రమే ఉండగా జపాన్ జాతీయ రుణం జీడీపీలో ఇంచుమించు 250 శాతంగా ఉన్నది. అయితే జపాన్ ప్రభుత్వం తీసుకున్న రుణాలలో అత్యధికం దేశీయ బ్యాంకులు, మదుపుదారుల నుంచి తీసుకున్నవే. అమెరికా తనకు అవసరమైన నిధులను చాలా వరకు ఫెడరల్ రిజర్వ్ బాండ్లను విక్రయించడం ద్వారా సమకూర్చుకుంటున్నది. ఈ బాండ్ల కొనుగోలుదారు లలో అత్యధికులు విదేశీ సంస్థలు, మదుపుదారులే కావడం గమనార్హం. ఈ భారీ రుణంపై ఏటా 1 లక్ష కోట్ల డాలర్లకు పైగా వడ్డీ చెల్లిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినవారు నష్టాలు వాటిల్ల వచ్చనే భయంతో వాటిని విక్రయిస్తున్నారు. తక్కువ వడ్డీ రేట్లకు ఆ బాండ్లను మరిన్ని కొనడానికి నిరాకరి స్తున్నారు. ఈ పరిస్థితి కూడా అమెరికా రుణ సంక్షోభానికి దారితీసింది. దీని నుంచి బయట పడేందుకు తాను అమ్మిన బాండ్లను తానే కొనుగోలు చేసేందుకు అమెరికా సంసిద్ధమయినప్పటికీ పరిస్థితి మెరుగు పడడం లేదు. ఫెడరల్ ప్రభుత్వం తీసుకునే రుణం గరిష్ఠంగా 41.1 ట్రిలియన్ డాలర్లకు మించకూడదని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ పరిమితి విధించింది. అయితే అంతకంతకూ పెరుగుతోన్న జాతీయ రుణ పరిమాణం ఆ గరిష్ఠ పరిమితిని 2027 ద్వితీయార్థంలో దాటుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇదంతా కూడా వాణిజ్య విధానాల కారణంగానే అని చెప్పుకోవాలి. వివిధ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించడంతో స్వేచ్ఛా వాణిజ్యం దెబ్బతింది. ప్రతి సెకనూ 90వేల డాలర్ల మేరకు, దినసరిన 7.8 బిలియన్ డాలర్ల మేరకు జాతీయ రుణం పెరుగుతుందని కాంగ్రెస్ జాయింట్ ఎకనామిక్ కమిటీ వెల్లడించింది. 2036 సంవత్సరం నాటికి ఈ రుణభారం 64 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా ఆ కమిటీ పేర్కొంది ప్రతి అమెరిన్ పౌరుడిపై తలసరి రుణభారం 1,19,686 డాలర్లుగా లెక్క కట్టింది. అమెరికాకు ఈ రుణ దుస్థితి దాపురించడానికి డెమొక్రాటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కారణమయిన ప్పటికీ డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మరింత దిగజార్చా యని అమెరికన్‌లే గగ్గోలు పెడుతున్నారు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తానన్న ట్రంప్ నిజానికి అమెరికా పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారని అనేకులు వాపోతున్నారు. అమెరికా ఫస్ట్ నినాదం ఇప్పుడు ఆర్థిక పనం దిశగా సాగుతోంది.

# ప్రపంచ రికార్డుల ప్రస్థానానికి ఆరంభం

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ - 1955 తొలి సంచిక

1955 ఆగస్టు 27న బ్రిటన్‌లో వెలువడిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తొలి సంచిక, మానవ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం రాసింది. ఇప్పటి వరకు వ్యక్తుల వ్యక్తిగత కీర్తి, దేశాల ప్రత్యేకతలు, ప్రకృతి అద్భుతాలు విడివిడిగా పత్రికల్లో, పుస్తకాలలో నమోదు అయ్యేవి. కానీ వాటిని ఒకే చోట సమీకరించి, శాస్త్రీయంగా వర్గీకరించి, ప్రజలకు సులభంగా అందించే ప్రయత్నం ఇదే తొలిసారి.




ఆ తొలి సంచికతోనే ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా అపూర్వ ఆదరణ పొందింది. కాలక్రమేణా ఇది కేవలం ఒక పుస్తకమే కాకుండా, మానవ ప్రతిభ, కృషి, కల్పన, విచిత్రతలకు ప్రతిబింబంగా మారిన వేదికగా నిలిచింది.

ఈ ఆలోచనకు బీజం 1951లో ఐర్లాండ్‌లో వేసిన ఒక వేట సంఘటన లో పడింది. గిన్నిస్ బ్రూవరీస్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ హ్యూ బీవర్, తన మిత్రులతో కలిసి వేటలో పాల్గొన్నప్పుడు "యూరప్‌లో అత్యంత వేగంగా ఎగిరే పక్షి ఏది?" అన్న ప్రశ్నపై వాదన ప్రారంభమైంది. వారు అందుబాటులో ఉన్న పుస్తకాలు తిరగేసినా తగిన ఆధారాలతో కూడిన సమాధానం దొరకలేదు. ఈ సంఘటన బీవర్ మదిలో ఒక వినూత్న ఆలోచనకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ప్రశ్నలకు, వాదనలకు ముగింపు పలికి, సమగ్ర సమాచారం అందించే ఒక గ్రంథం అవసరమని ఆయన గ్రహించారు.

తన ఆలోచనను ఆచరణలోకి తీసుకు వెళ్లేందుకు బీవర్ లండన్‌లో గణాంక సేకరణలో ఖ్యాతి పొందిన కవల సోదరులు నోరిస్ మెక్‌విర్టర్, రాస్ మెక్‌విర్టర్‌లను సంప్రదించాడు. వీరు అప్పటికి ఫాక్ట్ ఫైండర్స్ ఏజెన్సీ పేరిట సమాచార సేకరణ సంస్థను నడుపు తున్నారు. గిన్నిస్ సంస్థ ఆర్థిక సహకారంతో ఈ సోదరులు విస్తృతంగా పరిశోధనలు చేసి, వివిధ రంగాల నుంచి రికార్డులను సేకరించారు. క్రీడలు, ప్రకృతి, శాస్త్రం, సాంకేతికం, మానవ ప్రతిభ, కళలు, వినోదం వంటి విభిన్న విభాగాల్లోని విశేషాలను గణాంకాలతో సమీకరించి, పుస్తక రూపంలో కూర్చారు.

అనేక నెలల శ్రమతో సిద్ధమైన ఈ గ్రంథం 1955 ఆగస్టు 27న లండన్ ఫ్లీట్ స్ట్రీట్‌లో విడుదలైంది. 197 పేజీలతో వెలువడిన ఆ తొలి సంచిక అద్భుతమైన విజయాన్ని సాధించింది. విడుదలైన మొదటి రోజే అది ప్రజల దృష్టిని ఆకర్షించింది. నాలుగు నెలల వ్యవధిలోనే అది బ్రిటన్‌లో అత్యధికంగా అమ్ముడైన నాన్-ఫిక్షన్ పుస్తకంగా నిలిచింది. ఆ సంవత్సరం క్రిస్మస్ సీజన్ నాటికి దాదాపు ప్రతి ఇంటికి చేరేంతగా అది ప్రాచుర్యం పొందింది.

ఆ తొలి సంచికలోనే అనేక ఆసక్తికరమైన రికార్డులు చోటు చేసుకున్నాయి. అమెరికాకు చెందిన రాబర్ట్ వాడ్లో 8 అడుగులు 11 అంగుళాల ఎత్తుతో అత్యంత పొడవైన మనిషిగా గుర్తింపు పొందాడు. భారత దేశానికి చెందిన గుల్మ్ మహమ్మద్ కేవలం 57 సెంటీమీటర్ల ఎత్తుతో అత్యంత చిన్న మనిషిగా నమోదు అయ్యాడు. బ్రిటన్‌లో నడిచిన "మల్లార్డ్" స్టీమ్ లోకోమోటివ్ గంటకు 126 మైళ్ళ వేగంతో ప్రపంచం లోనే వేగవంతమైన రైలు కీర్తి సాధించింది. కాలిఫోర్నియా లోని బ్రిసిల్ కోన్ పైన్ సుమారు 4,000 ఏళ్ల వయసుతో అత్యంత పాత వృక్షంగా నిలిచింది. ప్రపంచం లోనే ఎత్తైన భవనం న్యూయార్క్ లోని "ఎంపైర్ స్టేట్ బిల్డింగ్"గా పేర్కొనబడింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా ముద్రించ బడిన పుస్తకంగా బైబిల్ నమోదు అయింది. ఇవన్నీ పాఠకులను ఆకర్షించడమే కాకుండా, భవిష్యత్తు సంచికల పునాది వేయించాయి.

ఈ పుస్తకం వెలువడిన రెండవ సంవత్సరానికే, 1956లో అమెరికాలో ప్రత్యేక సంచిక విడుదలైంది. తర్వాత ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లోనూ అనువాదాలు వచ్చాయి. కేవలం పది సంవత్సరాల్లోనే 3.5 మిలియన్ కాపీలు అమ్ముడై, ఒక అద్భుత ప్రచురణా చరిత్రను సృష్టించింది. 1960ల నాటికి ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ తాజా రికార్డులను సేకరించడం ప్రారంభమైంది. కాలక్రమేణా రికార్డులను సేకరించడం, ధృవీకరించడం శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన కఠిన ప్రక్రియగా మారింది.

ఈ గ్రంథం ప్రభావం విశేషం. మానవులలోని పోటీ భావన, కృషి, విశ్వాసం, ప్రతిభను వెలికి తీసింది. అనేక మంది వ్యక్తులు, సంస్థలు గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించాలనే తపనతో కొత్త రికార్డులు సృష్టించేందుకు ప్రేరణ పొందారు. ఈ ప్రస్థానం కేవలం రికార్డుల సేకరణకే పరిమితం కాకుండా, మానవ సృజనాత్మకతకు, ధైర్యానికి, పట్టుదలకు వేదికగా నిలిచింది.

నేడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పేరుతో ఈ పుస్తకం 100కుపైగా దేశాల్లో, 20కుపైగా భాషల్లో ప్రచురించ బడుతోంది. ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ లక్షలాది కాపీలు అమ్ముడవుతున్నాయి. పుస్తకం మాత్రమే కాదు, టెలివిజన్ కార్యక్రమాలు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విశేష ఆదరణ పొందుతోంది.

1951లో ఒక వేట ప్రయాణంలో పుట్టిన చిన్న ఆలోచన, 1955లో పుస్తక రూపంలో ఆవిష్కృతమై, నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ఆకర్షించే అంతర్జాతీయ వేదికగా మారింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పుస్తకం కేవలం గణాంకాల సంకలనం మాత్రమే కాదు, మానవ కల్పనాశక్తి, కృషి, ప్రతిభ, ధైర్యానికి ప్రతిబింబం. ఇది ప్రపంచ అద్భుతాలను ఒకే అద్దంలో చూపించే చరిత్రాత్మక గ్రంథంగా, నేటికీ అప్రతిహతమైన ఆదరణతో కొనసాగుతోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**


# నిషేధానికి గురైన తొలితెలుగు చిత్రం 'రైతుబిడ్డ'

## ఆగస్టు 27 ...1939న విడుదలైన సినిమా







తెలుగు సినిమా చరిత్రలో ప్రభుత్వం ఆంక్షలకు, నిషేధానికి గురైన మొట్ట మొదటి చిత్రం 'రైతుబిడ్డ'. ఆ రోజుల్లో జమీందారీ వ్యవస్థకూ, విధానాలకూ వ్యతి రేకంగా ఈ చిత్రం చేయడం ఒక రకంగా పెద్ద సాహసమే. ఈ చిత్రంలో జమీందార్ల దౌర్జన్యాలను కళ్ళకు కట్టినట్టుగా చూపించారు గూడవల్లి రామబ్రహ్మం. ఆనాటి జమీందారీ గ్రామాలలో సన్న కారు రైతులు అనుభవిస్తున్న కడ గండ్లను, జమీందారుల అకృత్యాలను, ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించాలని, ఈ విషయంలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా తట్టుకుని నిలబడాలని రామబ్రహ్మం ధృఢ నిశ్చయం చేసు కున్నారు. ఈ వాస్తవాన్ని జీర్ణించు కోలేని జమీందారులు ఆగ్రహించి, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి చివరికి ఆయా జమీందార్ల ప్రోద్బలంతో నిషేధింప చేశారు. బొబ్బిలి రాజా, వెంకటగిరి రాజా సినిమా నిర్మాత మీద పరువు నష్టం దావా వేస్తామని బెదిరించారు. తెలుగు చలన చిత్రాల్లోని కథా గమనానికి కొత్త స్ఫూర్తినిచ్చిన ఈ చిత్రంను లక్ష రూపాయలకు పైగా వ్యయంతో మద్రాసులోని ఎం.పి.పి.సి. స్టూడియో ప్రాంతంలో నిర్మించి 27-8-1939న విడుదల చేశారు. 'గూడవల్లి రామబ్రహ్మం... 'దున్నే వాడిదే భూమి', 'జమీందారీ విధానాలు పోవాలి' లాంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 'రైతుబిడ్డ' కథ సిద్ధం చేశారు. తాపీ ధర్మారావు నాయుడు, త్రిపురనేని గోపీచంద్ తో కలిసి 'రైతుబిడ్డ'కు మాటలు రాశారు. కొన్ని పాటలను తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచార్య రాశారు. మల్లాది విశ్వనాథ కవిరాజు హాస్య సంభాషణలు సమ కుర్చారు. అప్పటికే రైతు ఉద్యమం మీద పాటలు రాసిన కొసరాజు రాఘవయ్య చౌదరిని రైతు ప్రతినిధి రామిరెడ్డి పాత్రకు ఎంపిక చేశారు. ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, నెల్లూరు. ''జమీన్ రైతు' వార పత్రిక స్థాపకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు గేయాలను, తుమ్మల సీతా రామమూర్తి పద్యాలను కూడా ఈ చిత్రంలో రామబ్రహ్మం వినియోగించు కున్నారు. కథానాయకుడైన రైతు పెద్ద నర్సిరెడ్డి పాత్రకు బళ్ళారి రాఘవను ఎంపిక చేసుకున్నారు. ఆయన భార్య పాత్రకు ప్రముఖ రంగస్థల నటి కొమ్మూరి పద్మావతి దేవి ఎంపికయ్యారు. ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు సోదరుని కుమార్తె 14 ఏళ్ల టంగుటూరి సూర్య కుమారిని రైతు కుమార్తె పాత్రకు తీసుకున్నారు. 1939 ఆగస్టు 27న 'రైతుబిడ్డ' ఆంధ్ర దేశంలో 11 కేంద్రాల్లో విడుదలైంది. అంతకు ముందే ఆ చిత్ర ప్రదర్శనను ఆపు చేయిం చాలని కొంత మంది జమీందార్లు న్యాయస్థానం ద్వారా 'స్టే ఆర్డర్' జారీ చేయించారు. కానీ, అప్పటికే సెన్సార్ బోర్డు వారు ఆ సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వడంతో సినిమా విడుదలకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. వెంకటగిరి జమీందార్లు. 'రైతుబిడ్డ' చిత్రం ప్రింట్లు కొన్నింటిని తగలబెట్టించి ప్రదర్శనలను ఆపు చేయించడానికి ప్రయత్నిం చడంతో అల్లర్లు చోటు చేసుకున్నాయి. జమీందారీ వ్యవస్థలను రద్దు చేయాలని ప్రభుత్వం బిల్లు పెట్టిన కొన్నేళ్లకు ముందే రామబ్రహ్మం 'రైతు బిడ్డ'ను తీసి దర్శకుడిగా తానెంత ముందు చూపు గల వాడినో నిరూపించు కున్నారు. అందుకే మదరాసు అసెంబ్లీలో టంగుటూరి ప్రకాశంగా బిల్లు ప్రవేశ పెట్టడానికి 'రైతు బిడ్డ' సినిమా ఎంత గానో తోడ్పడిందని అప్పట్లో చెప్పుకునేవారు. 'మాలపిల్ల' సినిమాతో తెలుగు సినిమా సంగీతాన్ని ఒక మలుపు తిప్పిన భీమవరపు నరసింహారావు 'రైతుబిడ్డ'తో మరోసారి తన సత్తా చాటుకున్నారు. అలాగే జమీందారు అనుచరుడిగా రైతులను పీడించే ఖాసా సుబ్బన్న పాత్రలో ఆయన నటించారు. కొసరాజు పాటలు రాసి, నటుడుగా కూడా ఆయనకు తన పాత్రకు సంబంధించిన పాటలను తానే పాడుకున్నారు. బళ్లారి రాఘవ కీర్తిని మరింత పెంచింది ఈ సినిమా. ప్రసిద్ధ నృత్య దర్శకుడు వేదాంతం రాఘవయ్య ఈ చిత్రానికి నృత్య సారథ్యం వహించడమే కాక, దశావతార నృత్య సన్నివేశంలో నటించారు కూడా. గూడవల్లి రామబ్రహ్మం కూడా ఈ చిత్రంలో పత్రికా సంపాదకునిగా నటించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ మాగోఖలే ఈ సినిమా ద్వారానే ప్రవేశించారు. మద్రాసు ప్రావిన్స్ ప్రధాన మంత్రిగా వున్న (1930-32) బొల్లిని ముని స్వామి నాయుడికి ఈ చిత్రాన్ని అంకిత మిచ్చారు. ఆయన రైతు పరిరక్షణకు తనవంతు సహాయ సహకారాలు అంద జేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

ప్రభాతనవ సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం
Singidi గురువారం 27-8-2026

## ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



- నగరవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
- ప్రజల ఆశీస్సులతో అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్న మేయర్

**కరీంనగర్, ఆగస్టు26(సింగిడి):** నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం శివభక్త హనుమాన్ దేవాలయం, కోదండ రామాలయం, మహాశక్తి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశక్తి దేవాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి ఆశీస్సులు పొందగా, ఆయన మేయర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్, వెంకటాద్రి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. వివేకానంద చౌరస్తా, తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. తెలంగాణ చౌక్‌లో 39 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. బస్టాండ్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదం అందించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. చింతకుంట శాంతినగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకకు ప్రణవ్‌బాబు హాజరు



**జమ్మికుంట, ఆగస్టు 26 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని గీతా మందిర్ లో బుధవారం నినాదం పత్రిక ఆర్సి ఇంచార్జ్ అయితా రాధాకృష్ణ కుమార్తె అయితా రుచిత శ్రవణ్ కుమార్ ల నిశ్చితార్థ వేడుకలకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ బాబు హాజరై వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలపడంతో పాటు నిండు నూరేళ్లు కలకాలం అన్యోన్యంగా కలిసి ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, పొన్నగంటి మల్లయ్య, కౌన్సిలర్ చందా రాజు, మార్కెట్ డైరెక్టర్ దొడ్డే శ్యామ్, సలీం, వెంకన్న, శ్రీనివాస్ తోపాటు అయితే వేణుగోపాల్ సత్యనారాయణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 26 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని గీతా మందిర్లో బుధవారం జరిగిన నినాదం దినపత్రిక హుజురాబాద్ ఆర్ సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ కుమార్తె అయిత రుచిత శ్రవణ్ కుమార్ ల నిశ్చితార్థ వేడుకలకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరై వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నూతన దంపతులు కాబోతున్న శ్రావణ్ రుచితలను అభినందించడం తోపాటు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ నిశ్చితార్థ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కలపల్లి సత్యనారాయణ రావు తోపాటు మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ రావు ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



**పటాన్చెరు , ఆగస్టు 26: (సింగిడి):** పాశమైలారం శ్రీశ్రీ శ్రీ త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రతిష్ఠాపన మహో త్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమ య్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మొదటి రోజు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కొనసాగనున్న ప్రతిష్ఠాపన కార్యక్రమా లకు భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలిరోజు ఉదయం 8 గంటల నుంచి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆగస్టు 27 ఉదయం 8 గంటల నుండి రెండో రోజు కార్యక్రమాలు కొనసాగను న్నాయి. ఆవాహిత దేవతా పూజలు, మండప పూజలు, వివిధ హోమ కార్యక్ర మాలతో పాటు అమ్మవారి ప్రతిష్ఠాపనకు సంబంధించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఆగస్టు 28న శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మూడో రోజు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణోత్తములు నిర్ణయించిన సుముహూర్తము ఉదయం 8 గంటల 13 నిమిషములకు శ్రీ త్రిశక్తి దుర్గాభవాని దేవి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని ప్రతిష్టాపనకు సంబంధించిన ప్రధాన పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

# మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు!

- ఆడబిడ్డ పెళ్లికి ముందే రూ.25 వేల ఆర్థికసాయం..
- వివాహానికి హాజరై ఆశీర్వదించిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్

**కరీంనగర్, ఆగస్టు26(సింగిడి):** ప్రజలకు ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టడమే నిజమైన ప్రజాసేవ అని చాటుతూ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. 58వ డివిజన్‌కు చెందిన దుర్శెట్టి ప్రసూన--మహేంద్ర చారి దంపతుల కుమార్తె అనుశ్రీ వివాహానికి హాజరైన ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వివాహానికి ముందే రూ. 25 వేల ఆర్థిక సహాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకం బాధ్యతను మరింత పెంచుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యమని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం తనకు సంతృప్తినిస్తుందని తెలిపారు. వివాహానికి ముందే ఆర్థిక సహాయం అందించడంతో పాటు స్వయంగా పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కుటుంబ సభ్యుడిలా వారి శుభకార్యాల్లో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.



## ప్రేమ,దయ, కరుణ,సోదరభావమే ప్రవక్త మహమ్మద్ బోధనలు

**మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్, ఆగస్టు26(సింగిడి):** ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం వంటి గొప్ప విలువలను బోధించారని పేర్కొన్నారు. ఆయన జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొంది ప్రజలంతా మతాలు, వర్గాలకు అతీతంగా పరస్పర సామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. శాంతి, ఐక్యతను కాపాడుతూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని నింపాలని ఆకాంక్షించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.



## భుజం, మోకాలి సమస్యలకు అధునాతన చికిత్స

**ఆర్థోస్కోపీతో తక్కువ నొప్పి, వేగవంతమైన కోలుకునే అవకాశం**

**యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ సుకేష్‌రావు**

**కరీంనగర్, ఆగస్టు26(సింగిడి):** భుజం, మోకాలి సమస్యలకు అధునాతన చిన్న కోత శస్త్రచికిత్సలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ సుకేష్ రావు సంకినేని తెలిపారు. అధునాతన కీళ్ల సంరక్షణ విభాగంలో భుజం, మోకాలి ఆర్థ్రోస్కోపీ సేవలను విస్తరించినట్లు వెల్లడించారు. ఆర్థ్రోస్కోపీ విధానంలో చిన్న రంధ్రం ద్వారా కెమెరాతో కీళ్ల లోపలి భాగాలను స్పష్టంగా పరిశీలించి, దెబ్బతిన్న కణజాలానికి మాత్రమే చికిత్స అందిస్తారు. దీనివల్ల చుట్టుపక్కల కండరాలకు తక్కువ నష్టం, తక్కువ నొప్పి, ఇన్ఫెక్షన్ ముప్పు తగ్గడం, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ సుకేష్ రావు అన్నారు. బుధవారం రోజున యశోద హాస్పిటల్ కరీంనగర్ బ్రాంచ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ, భుజానికి సంబంధించిన కండరాలు చిరగడం, మృదులాస్థి దెబ్బతినడం, భుజం కీలు పదేపదే జారడం, భుజం. బిగుసుకు పోవడం వంటి సమస్యలకు, మోకాలిలో మెనిస్కస్ చిరగడం, లిగమెంట్ పునర్నిర్మాణం, మృదులాస్థి సమస్యలు, ప్రారంభ దశ కీళ్ల వాతం వంటి సమస్యలకు ఈ విధానంలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చాలా సందర్భాల్లో అదే రోజు ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ఆధునిక శస్త్రచికిత్స పరికరాలతో పాటు స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు, ఫిజియోథెరపిస్టుల సహకారంతో పరీక్షల నుంచి పూర్తిస్థాయి పునరావాసం వరకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ విలేకరుల సమావేశం లో మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.



## ఉత్తమ కూచిపూడి నృత్య అకాడమీగా భావనలయ అకాడమీకి అవార్డుల పరంపర

**అల్వాల్, ఆగస్టు 26(సింగిడి):** మల్కాజ్ గిరి ప్రాంతానికి చెందిన భావనలయ నృత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డా వట్టికోట యాదగిరా చార్యులు శిష్య బృందం నాగపూర్లో శ్రీకృష్ణ కల్చరల్ ఫౌండేషన్ ,నాగపూర్ వారి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా డ్యాన్స్ మ్యూజిక్ పోటీలను ఆగస్టు 20 నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించగా భావనలయ నృత్య అకాడమీ నుంచి సుమారు 50 మంది కూచిపూడి విద్యార్థులు నృత్య పోటీల్లో పాల్గొనగా 22 మంది విద్యార్థులకు ప్రథమ ,ద్వితీయ ,తృతీయ స్థానాల్లో విజయ కేతనం ఎగరవేసినట్లు ఆచార్య డా వట్టికోట యాదగిరా చార్యులు తెలిపారు. భావనలయ నృత్య అకాడమీ దాదాపు గా 35 సంవత్సరాల నుంచి వివిధ ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తూ పలువురి ప్రశంసలు పొందినట్లు తెలిపారు. నృత్య విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలు విజయం సాధించడం ఆనందదాయకమని హర్షం వ్యక్తం చేసినట్లు ఆయన వెల్లడించారు. నాగపూర్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ నృత్య అకాడమీ అవార్డ్, ఉత్తమ నృత్య ప్రదర్శనకు గాను దేవహర్ష కు అవార్డ్ లభించింది. ఇదే పరంపరను మునుముందు తమ నృత్య అకాడమీ మరెన్నో విజయాలు సాధిస్తుందని ఆశాభావాన్ని ఆచార్య వట్టికోట యాదగిరా చార్యులు వ్యక్తం చేశారు.



## మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు గౌరవ డాక్టరేట్.. మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు

**దుబ్బాక, ఆగస్టు26 (సింగిడి):** సమాజంలోని నిరుపేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆమె సామాజిక సేవలను గుర్తించిన న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అలాగే మదర్ థెరిస్సా సేవారత్న అవార్డుతో పాటు బంగారు పతకంతో ఘనంగా సత్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు డాక్టరేట్, సేవారత్న అవార్డు, బంగారు పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా న్యూ లైఫ్ థియాలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ బిషప్ డాక్టర్ జోసెఫ్ పలంగి మాట్లాడుతూ.. సామాజిక సేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ పేదలు, నిరుపేద కుటుంబాలు, అణగారిన వర్గాలకు తనవంతు సహాయాన్ని అందిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆమె సేవలను గుర్తించి యూనివర్సిటీ తరఫున 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు, బంగారు పతకంతో సత్కరించినట్లు పేర్కొన్నారు. మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరిస్సా పేరుతో లభించిన ఈ గౌరవాలు మహమ్మద్ సుల్తాన ఉమర్‌పై మరింత బాధ్యతను పెంచాయని ఆయన అన్నారు. అనంతరం మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ.. "గౌరవాలు, అవార్డులు వ్యక్తిగతంగా నాకు దక్కినవిగా భావించడం లేదు. సమాజం కోసం సేవ చేస్తున్న ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నాను. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, పేదల జీవితాల్లో చిన్న మార్పు తీసుకురావడమే నా లక్ష్యం. ఈ గౌరవాలు భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తాయి" అని అన్నారు. ఒకవైపు 'డాక్టర్ ఆఫ్ సోషల్ మినిస్ట్రీ' గౌరవ డాక్టరేట్, మరోవైపు 'మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు', బంగారు పతకం లభించడం తన సామాజిక సేవా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచిందని పలువురు అభినందించారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సమాజం కోసం పనిచేస్తున్న మహమ్మద్ సుల్తాన ఉమర్ సేవలు మరెందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కమ్యూనిటీ సభ్యులు డాక్టర్ రోనాల్డ్ జాన్, హైదరాబాద్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ అండ్ కౌన్సిలర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. జీవన్ తదితరులు పాల్గొన్నారు.




## ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలలో పాల్గొన్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26 (సింగిడి):** ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలలో నిర్వహించిన ర్యాలీలో ముస్లిం సోదరులతో కలిసి మాజీ టీపీసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం సమాజంలో మరింతగా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. సర్వమతాల సమైక్యతే మన బలం, సోదరభావమే మన అభివృద్ధికి మార్గం అని సొంటి రెడ్డి పున్నారెడ్డి వివరించారు.



## పి.ఆర్.ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ సంస్థ ప్రారంభం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి**



**సిద్దిపేట ప్రతినిధి, ఆగస్టు 26 (సింగిడి):** సిద్దిపేట పట్టణంలో పి. ఆర్. ఏ స్క్వేర్ ఇంటీరియర్స్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, సంస్థ నిర్వాహకులు కొలుపుల ప్రవీణ్ ని కలిసి నూతనంగా ప్రారంభించిన ఇంటీరియర్స్ సంస్థకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సిద్దిపేటలో నూతన వ్యాపార సంస్థలు ప్రారంభించడం అభినందనీయమని, యువత వ్యాపార రంగంలో రాణిస్తూ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**అల్వాల్, ఆగస్టు 26(సింగిడి):** పవిత్ర జష్న్-ఎ-మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా మల్కాజ్‌గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మచ్చబొల్లారం డివిజన్‌లో మహమ్మద్ జావిద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముస్లిం సోదరులకు జష్న్-ఎ-మిలాద్-ఉన్-నబీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, శోభన్ బాబు, భాస్కర్ రెడ్డి, అతిక్ పాషా, మహేష్, సురేష్, జనార్ధన్, సాజిద్, వెంకటేష్ గణేష్, ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

**ఆకట్టుకున్న మక్కా మదీనా ఖాబా షరీఫ్ ప్రదర్శన**



**అమనగల్లు ఆగస్టు 26(సింగిడి):** ఆమనగల్లు పట్టణంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మస్జీద్ లలో ప్రతేక ప్రార్థనలు నిర్వహించి జాగరణ చేపట్టారు. బుధవారం పట్టణంలో ముస్లిం మైనార్జీ నాయకులు, సోదరులు, యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రధాన రహదారి పై నారే తక్బీర్ అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు చేస్తూ పలు విధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మక్కా మదీనా, ఖాబా షరీఫ్ యొక్క ప్రదర్శన చూపరులను ఆకట్టు కుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని సిఐ వెంకటేశ్వర్లు , ఆధ్వర్యంలో సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, పాపిశెట్టి రాము నాగిళ్ళ జగన్, ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- హెవీ వెహికల్స్ సిటీ బయట పార్క్ చేసేలా చర్యలు తీసుకోవాలి
- రహదారులపై ఎడ్జ్ లైన్స్ స్పష్టంగా కనిపించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, ఆగస్టు 26(సింగిడి):** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిలు సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు భద్రత సంబంధించి చేపట్టిన చర్యల గురించి ఆర్ అండ్ బీ ఈ. దేవిక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ ప్రతీ వాహనదారులు రోడ్ భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. ప్రైవేట్ బస్సులు, టాక్సీ వాహనాలు రోడ్ల పక్కన నిలిపి ఉంచడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, రంగలీలా మైదానం, హయాగ్రీవాచారి మైదానంలో నిలిపేవిధంగా మున్సిపల్, కుడా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై హద్దులకు సంబంధించి లైన్ మార్కింగ్ స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలన్నారు. వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయకుండా నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రహదారులపై విద్యుద్దీపాలు వెలిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు బాధితుల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో సమీప ఆసుపత్రులను గుర్తించి అక్కడికి తరలించే విధంగా అత్యవసర వాహనాల డ్రైవర్లకు, బ్లూ కోల్ట్స్ సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం నుండి త్వరగా క్షతగాత్రులను వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి హాస్పిటల్స్ కు తరలించేలా మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న హసన్ పర్తి చెరువు కట్ట వద్ద రహదారి వెడల్పు చేయడం జరిగిందని, రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని, పోతన నగర్ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్డును ఆనుకుని హెవీ వెహికల్స్, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలు పార్కు చేసి ఉంటున్నాయని, దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలా కాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా.... సిటీ కి దూరంగా వాహనాలు పార్కు చేసే ప్రదేశాలను అధికారులు గుర్తించాలన్నారు. ప్రైవేట్ బస్సులు, వాహనాలు రోడ్డు పక్కన ఇష్టారీతిన నిలిపి ఉంచుతున్నారని, వాహన యజమానులతో అధికారులు మాట్లాడి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ఫుట్ పాత్ లను ఆక్రమించడంతో పాదాచారులకి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, స్ట్రీట్ వెండర్స్ కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటుకు స్థలాలను పరిశీలించాలని సూచించారు. స్ట్రీట్ వెండర్స్ ఎక్కడపడితే అక్కడ విక్రయాలు చేయకుండా, స్ట్రీట్ వెండింగ్ జోన్లలోనే విక్రయాలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. గణపతి విగ్రహాలు ప్రధాన రహదారుల పక్కన కాకుండా ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఖాళీ మైదానంలో క్రయ విక్రయాలు చేసుకునేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించుకునే విధంగా అవగాహన కల్పించాలని, విగ్రహాల క్రయ విక్రయాలకు మున్సిపల్ శాఖ అధికారులు అనువైన ప్రదేశాలను గుర్తించాలని అన్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ లు ఎన్. రవి, శేషాద్రి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, జాతీయ రహదారుల శాఖవరంగల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బీ ఎన్హెచ్ ఈఈ కిరణ్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, రవాణా, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాజీపేట నూతన బస్టాండ్‌కు భూమి మార్పిడి ప్రక్రియ వేగవంతం చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎంపీ డా. కడియం కావ్య వినతి



**హన్మకొండ, ఆగస్టు 26(సింగిడి):** కాజీపేట నూతన బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన భూమి మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట సిగ్నల్ జంక్షన్ వద్ద దక్షిణ మధ్య రైల్వేకు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన భూ విలువ ప్రాతిపదకన మార్పిడి చేసేందుకు రైల్వే ప్రతిపాదించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, రైల్వేతో ప్రతిపాదిత భూముల మార్పిడికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ప్రభుత్వ భూమి లభ్యత, అనుకూలతను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కాజీపేట నూతన బస్టాండ్ నిర్మాణం పూర్తయితే కాజీపేటతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో భూమి మార్పిడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులకు మార్గం సుగమం చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట నూతన బస్టాండ్ నిర్మాణ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## ప్రజలకు నిష్పాక్షిక సేవలందించాలి

### చిట్యాల పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీ

### ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 26 (సింగిడి):** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిష్పాక్షికంగా, పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం చిట్యాల సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఎస్పీ సమీక్షించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల నమోదు, వివరాల నవీకరణ, బ్లూకోల్ట్ వాహనాల పనితీరు, సీసీ కెమెరాల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రిసెప్షన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా కొనసాగించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ పారదర్శకమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంజా రహిత సమాజమే లక్ష్యంగా పోలీసులు పని చేయాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా
- అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు
- 251 కిలోల గంజా స్వాధీనం విలువ రూ1.25 కోట్లు, ఒక ద్విచక్ర వాహనం, రూ 9వేల రూపాయల నగదు,ఒక సెల్‌ఫోన్ స్వాధీనం



**హన్మకొండ, ఆగస్టు 26(సింగిడి):** గాంజారహిత సమాజమే లక్ష్యంగా పోలీసులు అంకితభావంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పోలీస్ అధికారులకు సూచించారు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో కమిషనర్ మాట్లాడుతూ గాంజా నివారణలో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దష్టి పెట్టడం జరిగిందనీ తెలిపారు. ఇందులో భాగంగానే ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అధ్వర్యంలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్ప డుతున్న నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయడం జరిగిందన్నారు. దీంతో గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించిన కీలక విషయాలు వెలుగు లోకి వచ్చాయన్నారు. దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ముదిగొండ నాగేశ్వర్ రావు, వయస్సు 55, సులభంగా డబ్బు సంపాదనే ధ్యేయంగా నిందితుడు తనకు వున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్, సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహరాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, సునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాధమిక విచారణలో వెల్లడైందనీ ఆమె పేర్కొన్నారు. పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు రూ 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టుబడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగిందనీ ఆమె వివరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు వినియోగంపై తెలంగాణ పోలీస్ విభాగం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందనీ కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడుకోవడంతో పాటు, విక్రయదారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. మత్తు పదార్థాల కట్టడికై ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించాలని ప్రధానంగా ఎవరైన గంజాయి విక్రయాలకు పాల్పడినా, వినియోగించినా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసీపీ సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్.ఐ వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుళ్ళను కమిషనర్ అభినందించారు.

## సీనియర్ సివిల్ జడ్జిగా మహతి వైష్ణవి బాధ్యతల స్వీకరణ



- ఘన స్వాగతం పలికిన బార్ అసోసియేషన్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** జూనియర్ సివిల్ జడ్జి హోదా నుంచి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందిన తాడూరు మహతి వైష్ణవి మంగళవారం భూపాలపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనూరు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి, సన్మానించారు. బార్--బెంచ్ మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు, కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు బార్ అసోసియేషన్ తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి న్యాయవాదులు తమ వంతు సహకారం అందిస్తారని పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా భూపాలపల్లి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి స్థానం ఖాళీగా ఉండటంతో కక్షిదారులు, న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని సురేష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సీనియర్ సివిల్ జడ్జిగా మహతి వైష్ణవి బాధ్యతలు స్వీకరించడం పట్ల కక్షిదారులు, న్యాయవాదుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. కేసుల పరిష్కారంలో వేగం పెరిగి, న్యాయ ప్రక్రియ మరింత సజావుగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ తరపున జడ్జి మహతి వైష్ణవికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, కోశాధికారి ఇందారపు శివకుమార్, లైబ్రరీ కార్యదర్శి అకినపల్లి రవికుమార్, స్పోర్ట్స్ కార్యదర్శి సైండ్ల నాగరాజు, కల్చరల్ కార్యదర్శి గార్లపాటి ప్రియాంక, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు కనపర్తి కవిత, లేడీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు మచ్చ వసంత, న్యాయవాదులు రాజనీకాంత్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు మానవ మనుగడకు, ప్రకృతి అమూల్యమైనది

- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు
- పర్యావరణ సమతుల్యతతో భాగస్వాములు కావాలని పిలుపు
- వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**భూపాలపల్లి, ఆగస్టు 26(సింగిడి):** ప్రకృతి అమూల్యమైనదని, చెట్లు మానవ మనుగడకు ప్రాణాదారమని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని బొగులోని దేవాలయ సమీపంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో మన అడవి,మన భవిష్యత్తు, పచ్చదనం పెంచడం, ప్రాణాలను కాపాడుదాం అనే నినాదంతో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక్క మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపు కోసం అనేక కార్యక్రమాలను చేపడుతుందని, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అడవి శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వనం పెంచుదాం జనజీవనాన్ని రక్షిద్దాం

### పర్యావరణ వేత జీడిమెట్ల రవీందర్



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 26(సింగిడి):** వనం పెంచుదాం వాతావరణాన్ని కాపాడుదాం జనజీవనాన్ని రక్షిద్దాం అని వన మహోత్సవం సందర్భంగా మునుగోడు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవాలను నిర్వహించారు . ఈ సందర్భంగా ఎం డి హాఫీస్ ఖాన్ మునుగోడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పర్యావరణ వేత్త జీడిమెట్ల రవీందర్ లు ఈ సందర్భంగా మొక్కలు నాటి మానవాళి మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడు పై ఉందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఇండియన్ ఎన్విరాన్ మెంట్ సోషల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జీడిమెట్ల రవీందర్ మాట్లాడారు నాటి మొక్కను సంరక్షణ చేసే బాధ్యతగా చూసుకోవాల్సి ఉందిగా ఆయన సూచన చేశారు. అదేవిధంగా కాలుష్య నివారణకు ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను ట్రీట్మెంట్ ప్లాంట్లకు పంపించాల్సి ఉందని అన్నారు. అదేవిధంగా మునుగోడు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఆవరణంలో మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి ,సూపరిడెంట్ విజయ్ భాస్కర్ , ఎం పి ఓ కేదరీనాథ్, మునుగోడు ఫారెస్ట్ అధికారి ఎస్ సుచరిత, మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,మునుగోడు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గుంటూజు వెంకటాచారి, నాగరాజ్, మల్లేష్, శ్యామల, కాశి, కోణం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

### కోదాడ రూరల్ ఎస్ఐ యాకూబ్ సూచన



**కోదాడ,ఆగస్టు 26(సింగిడి):** కోదాడ రూరల్ మండలం కూచిపూడి తండాకు చెందిన యువకులు, ఉప సర్పంచ్ సీత మహాలక్ష్మి కుమారస్వామి మంగళవారం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ యాకూబ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని కోరారు.

## సాగునీరందించలేని మంత్రి ఉత్తం రాజీనామా చేయాల్సిందే...!

- రెండు శాఖలపై సమగ్ర విచారణ జరపాలని గవర్నర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే బొల్లం



**కోదాడ,ఆగస్టు 26(సింగిడి):** ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు సాగునీరందక వేసిన వరి పంటలు ఎండిపోతుండటంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్ల నుండి నీళ్లు పోయక ఇబ్బందులు పడుతుంటే సాగునీరు అందించలేని అసమర్థ, అవినీతి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించాలని కోదాడ నీటిపారుదల శాఖ కార్యాలయంలో రైతులతో కలిసి కార్యనిర్వాక ఇంజనీర్ కు కు వినతిపత్రం అందజేశారు.. అనంతరం కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ . గత జూన్ నెలలో సాగర్ ప్రాజెక్టు నుండి తాగునీటి కోసం చెరువులను నింపుకునేందుకు ఖమ్మం జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడ నుండి నీళ్లు తరలించకపోతుంటే మంత్రి ఉత్తమ్ ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు...... ఒకవైపు సాగర్ ప్రాజెక్టుకు గండికొట్టే విధంగా నదీ జలాల వాటా నిబంధనలను తుంగలో తొక్కి పోతిరెడ్డిపాడు నుంచి 10 టీఎంసీల నీటిని తీసుకెళ్తుంటే కాంగ్రెస్ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు... ప్రాజెక్టులో నీరు రాకపోవడానికి ఇది ప్రధాన కారణమన్నారు..... ఒకవైపు నీళ్లు లేక వర్షాభావ పరిస్థితుల్లో రైతులు గగ్గోలు పెడుతుంటే యాగాల పేరుతో మంత్రివర్గం కాలక్షేపం చేస్తుందని విమర్శించారు.. సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ లోను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీరు అందించిన మహనీయుడను కొనియాడారు.. ఎస్ ఎల్ బి సి పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని చెప్పి కమిషన్ల కోసం పనులు ప్రారంభించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వీరి అవగాహన లేమి వల్ల ఎనిమిది మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారని చివరకు మృతదేహాలను కూడా బయటికి తీసుకురాలేని దుస్థితి వీరి అసమర్థతకు సాక్షిభూతం అన్నారు.. .. నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లలో తెలంగాణకు ఉన్న హక్కులను కేఆర్ఎంబీకి అప్పజెప్పి తెలంగాణ రైతాంగానికి, ఉమ్మడి జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేసినచరిత్ర మంత్రిదన్నారు ... ఈ విషయంలో అవగాహన లేకుండా వ్యవహరిస్తున్న ఉత్తంకుమార్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో గవర్నర్ గ జోక్యం చేసుకుని ఆయనను బర్తరఫ్ చేయాలని కోరారు... ఉత్తంకుమార్ రెడ్డి నిర్వహిస్తున్న పౌర సరఫరాల శాఖ అవినీతిమయమైందని రాష్ట్రవ్యాప్తంగా మిల్లులలో ధాన్యం మాయమై అవినీతిమయమైందని, గవర్నర్ జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరపాలని కోరారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని రైతాంగానికి, ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని గుర్తించి తెలంగాణ రైతాంగానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.. ఈ ధర్నాలో మండల పార్టీ బాధ్యులు నల్ల భూపాల్ రెడ్డి చ జానకి రామాచారి , కూరాకుల కృష్ణమూర్తి, అనంతుల ఆంజనేయులు , ఏలూరు వెంకటేశ్వరరావు మద్ది మధుసూదన్ రెడ్డి , ఉపేంద్ర గౌడ్ , తాలూరి శ్రీనివాసరావు , ప్రదీప్ పిట్టల భాగ్యమ్మ నయీమ్ శ్రీకాంత్ కిరణ్ కుమార్, రైతులు, బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటాలి

### ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్



**డోర్నకల్ /మరిపెడ, ఆగస్టు 26(సింగిడి):** ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటాలని డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట జీపీలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట ప్రభుత్వ పాఠశాల సమీపంలో గ్రామ సర్పంచ్ గండి రాధమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. మొక్కలను మనం రక్షిస్తే,మనల్ని మొక్కలు రక్షిస్తాయి అన్నారు. మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ కు పాఠశాల విద్యార్థినిలు ముందస్తుగా రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి,ఏపీఓ రమేష్, కార్యదర్శి మంజుల,పిఎసిఎస్ వైస్ చైర్మన్ గండి మహేష్ గౌడ్,గ్రామపార్టీ అధ్యక్షులు వీరభద్రం,రమేష్, నాయకులు,అంగన్వాడీ టీచర్లు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం ప్రత్యేక ఓటీలు : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ఆలేరు, ఆగస్టు 26(సింగిడి):** రైతుల పొలాలకు సాగునీరు అందించడంతో పాటు చెరువులను నింపేందుకు ప్రత్యేక ఓటీల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం సంగ్య తండా పరిధిలోని కొండాపూర్ వద్ద మల్లన్నసాగర్ 15, 16వ ప్యాకేజీలకు సంబంధించిన కొండపోచమ్మ ప్రాజెక్టు ప్రధాన కాల్వను ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాల్వకు దిగువన ఉన్న గ్రామాలు, చెరువులు, ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకుని దిగువ ప్రాంతాలకు నీరు చేరేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని తెలిపారు.

**మరో రెండు ఓటీలు.. 80 చెరువులకు నీరు**

బస్వాపూర్ వైపు వెళ్లే కాల్వలో మరో రెండు ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 70 నుంచి 80 చెరువులకు నీటిని అందించే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరిగి, రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని చెప్పారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాల్వలకు ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేసి ఇప్పటికే అనేక చెరువులను నీటితో నింపగలిగామని బీర్ల అయిలయ్య తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ, డీఈలు, ఇతర సాంకేతిక సిబ్బందితో కలిసి అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఓటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.


**బస్వాపూర్, గంధమల్ల పూర్తయితే వేల ఎకరాలకు సాగునీరు**

బస్వాపూర్, గంధమల్ల ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయితే దిగువ ప్రాంతాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో ఆయా ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. బస్వాపూర్ భూ బాధితులకు, గంధమల్ల ప్రాజెక్టు భూ బాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, సాగునీటి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సాగునీటి వనరులను అభివృద్ధి చేసి రైతుల పొలాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు లక్ష్యం**

సాగునీటితో పాటు ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య తెలిపారు. షామీర్‌పేట్ మండలం ఘన్‌పూర్ వద్ద రూ. 210 కోట్లతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ కాలువ పనులను ఇటీవల పరిశీలించినట్లు చెప్పారు. పనులు పూర్తయితే నియోజకవర్గ ప్రజలకు ప్రతిరోజూ మరింత ఎక్కువ పరిమాణంలో తాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాల్వల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ప్రాంతాలకు నీటిని అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణం కాపాడుదాం



**మిర్యాలగూడ ఆగస్టు 26(సింగిడి):** మిర్యాలగూడ మండలం కాల్వపల్లి, కాల్వపల్లి తండా, తడకమళ్ల గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమంలో ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ, డిఎల్పిఓ రాఘవరావు, ఎంపీఓ మాతంగి రమేష్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈసీ ఎం.కళావతి సర్పంచ్ దీరావత్ అంజలి, లింగనాయక్, పంచాయతీ కార్యదర్శి సైదులు, సునావత్ కోటయ్య, సీనియర్ మేట్ దీరవత్ వనిత, ఫీల్డ్ అసిస్టెంట్ షాహిన్ సుల్తానా పాల్గొన్నారు. కాల్వపల్లి గ్రామపంచాయతీలో వన మహోత్సవం కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల రమణమ్మ, ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఆనంత శివ, చిన్నబోయిన వీరయ్య, టిఎ లాలు ఉపసర్పంచ్ గోవింద, చిట్టెమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ షాహిన్ సుల్తానా పాల్గొన్నారు. తక్కలపాడు గ్రామంలో తడకమళ్ళ రోడ్డుకు అవెన్యూ ప్లాంటేషన్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. శేషగిరిశర్మ, డిఎల్ పిఓ రాఘవరావు, ఎంపీఓ మాతంగి రమేష్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఈసీ కళావతి, గ్రామ సర్పంచులు చిటికల సుజాత జానయ్య, ఉప సర్పంచ్ మైనం మురళి, గుండు నరేందర్, వార్డ్ మెంబర్ దొంతగాని బిక్షం పంచాయతీ కార్యదర్శి కోడిరెక్కశైలజ, గ్రామ ప్రజలు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఈ ఆకు కూర తింటే..!

## ఆ విషయాల్లో ఢోకా ఉండదు..



### ఈ చిన్న తప్పులు చేస్తే అమృతం కాస్తా విషంగా మారుతుంది జాగ్రత్త

**శారీరక రుగ్మతలను నయం చేయడంలో ఇది ఒక సంజీవనిలా పనిచేస్తుంది అవిశ ఆకు. అయితే, ఈ ఆకుకూరను మిగతా సాధారణ తోటకూర, పాలకూరల వలె రోజూ తినకూడదు. దీనిని తీసుకునే విధానంలో కొన్ని ఖచ్చితమైన నియమాలను పాటించకపోతే ఆరోగ్య ప్రయోజనాలకు బదులు తీవ్ర నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉంది.**

అవిశ ఆకు శరీరంలోని ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఎంతో తోడ్పడుతుంది. ముఖ్యంగా కడుపులో పుండ్లు (అల్సర్లు), నోటి పూత సమస్యలతో బాధపడేవారికి ఇది అద్భుతమైన ఔషధం. ఈ ఆకులను క్రమం తప్పకుండా సరైన పద్ధతిలో తీసుకుంటే పేగుల్లోని నులిపురుగులు నశిస్తాయి. ఇది కంటిచూపును మెరుగుపరచడానికి , రక్తహీనతను నివారించడానికి కూడా ఉపయోగపడుతుంది.

అయితే, ఈ ఆకుకూరను వారంలో ఒక్కసారి లేదా పది రోజులకు ఒకసారి మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. ప్రతిరోజూ దీనిని తింటే జీర్ణవ్యవస్థ దెబ్బతినడమే కాకుండా తీవ్రమైన విరేచనాలు అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దీనిని అమితంగా కాకుండా అమృతంలా మితంగానే వాడాలి.

ఈ ఆకుకూరను వండేటప్పుడు చేసే అతి పెద్ద తప్పు ఏమిటంటే.. దీనిని సరిగ్గా ఉడికించకపోవడం. అవిశ ఆకు చాలా గట్టిగా ఉంటుంది, కాబట్టి దీనిని మెత్తగా ఉడికించిన తర్వాతే కూరగానో లేదా పప్పులోనో వాడుకోవాలి. పచ్చిగా లేదా సగం ఉడికిన ఆకులను తింటే కడుపునొప్పి వచ్చే ప్రమాదం ఉంది. అలాగే ఈ ఆకుకూర తిన్న రోజున చికెన్, మటన్ వంటి మాంసాహారాన్ని అస్సలు తీసుకోకూడదు. ఎందుకంటే అవిశ ఆకు మరియు మాంసాహారం రెండూ విరుద్ధ ఆహారాలు. ఇవి కలిసి శరీరంలో చేరితే జీర్ణక్రియ మందగించి, గ్యాస్ మరియు కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తీవ్రతరం చేస్తాయి.

మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏదైనా ఆరోగ్య సమస్య కోసం ఆయుర్వేద లేదా అల్లోపతి మందులు వాడుతున్న వారు అవిశ ఆకును తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఈ ఆకులో ఉండే శక్తివంతమైన మూలకాలు మనం వేసుకునే మందుల ప్రభావాన్ని తగ్గించివేస్తాయి. అలాగే గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు కూడా దీనిని నిపుణుల సలహా మేరకే తీసుకోవాలి. సాధారణంగా ఈ ఆకును ఉదయం లేదా మధ్యాహ్నం భోజనంలో తీసుకోవడం ఉత్తమం. రాత్రి వేళల్లో దీనిని తింటే అరగడం చాలా కష్టమవుతుంది. ఈ చిన్న చిన్న నియమాలను పాటిస్తూ అవిశ ఆకును తింటే, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా పూర్తి ఆరోగ్యాన్ని మన సొంతం చేసుకోవచ్చు.





## మరింత కొత్తగా వాట్సప్..
# త్వరలో సరికొత్త ఫీచర్లు!



ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ రానున్న రోజుల్లో మరింత కొత్త రూపు సంతరించుకోనుంది. సెక్యూరిటీ, ప్రైవసీకి ప్రాధాన్యమిస్తూ మరిన్ని అప్‌డేట్‌లను మెటా తీసుకురాబోతుంది . స్కామ్ అలర్ట్స్, వాయిస్ నోట్స్, వన్స్ టెక్ట్స్ మెసేజ్ వంటి పలు ఫీచర్లను పరీక్షిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను వాట్సప్ అప్‌డేట్లు అందించే వాబీటా ఇన్ఫో తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. ఇవి త్వరలోనే ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. మరి ఆ వివరాలేంటో లుక్కేద్దామా?

**స్కామ్ అలర్ట్స్:**

ఈ ఫీచర్ ప్రత్యేకంగా ఆండ్రాయిడ్ యూజర్ల కోసం పరీక్షిస్తోంది. తెలియని నంబర్ల చాట్ ఓపెన్ చేయగానే 'ఇది స్కామ్ అయ్యుండొచ్చు' అని హెచ్చరిస్తుంది. అయితే, ఆ చాట్ కొనసాగించాలా?వద్దా? అని పూర్తిగా వినియోగదారుడి ఇష్టం.

**వాయిస్ నోట్స్:**

ఆండ్రాయిడ్ యూజర్లకు వాట్సప్ వాయిస్ సందేశాలు మరింత సులభం కానున్నాయి. ఫోన్ హోమ్ స్క్రీన్ నుంచే వాయిస్ మెసేజ్‌లు పంపొచ్చు. ఇందుకు వాట్సప్ వాయిస్ నోట్ ఫీచర్‌ను విడ్జెట్‌ల సెట్ చేసుకోవచ్చు. ఈ ఫీచర్ వస్తే వాయిస్ సందేశాలు పంపే యూజర్లకు అస్తమానం వాట్సప్ ఓపెన్ చేసే అవసరం తప్పుతుంది.

**వన్స్ టెక్ట్స్ మెసేజ్:**

వాట్సప్‌లో అప్పటికప్పుడు పంపే డిస్సప్పియర్ ఫొటోలు, వీడియోలు, వాయిస్ నోట్స్ ఉన్నాయి. ఇక ఈ జాబితాలో టెక్ట్స్ మెసేజ్‌లూ చేరనున్నాయి. అంటే అవతలి వ్యక్తి సందేశాలు చూడగానే మాయమైపోతాయి. వీటిని కాపీ చేయడం, ఫార్వార్డ్ చేయడం, సేవ్ చేసుకునే ఆప్షన్లు ఉండవు.

**షెడ్యూల్డ్ మెసేజ్:**

యూజర్లకు ఎంతగానో ఉపయోగపడే మరో ఫీచర్ త్వరలో రానుంది. యూజర్లు పంపాలనుకునే సందేశాలను ముందుగానే సెట్ చేసుకోవచ్చు. ఆ సమయానికి వాట్సప్ ఆటోమెటిక్‌గా డెలివరీ చేస్తుంది. ముఖ్యంగా సన్నిహితుల పుట్టిన రోజులు, పెళ్లి రోజుల సమయంలో ఈ సదుపాయం ద్వారా విషెస్‌ను ముందుగానే షెడ్యూల్ చేసి పెట్టుకోవచ్చు. ఐఓఎస్ యూజర్లకు ఈ ఫీచర్ ముందుగా రాబోతోంది.

## స్టాక్ మార్కెట్
Stock Market

## భారతీయుడికి మరో అరుదైన గౌరవం..
# వాట్సప్ సీఈవోగా 'క్రెడ్' కునాల్ షా



భారతీయుడికి మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ క్రెడ్ వ్యవస్థాపకుడు కునాల్ షా.. మెటాకు చెందిన వాట్సప్ సీఈవోగా నియమితులయ్యారు. 2019 నుంచి మెసేజింగ్ యాప్ సీఈఓగా వ్యవహరిస్తున్న విల్ కాథ్‌కార్ట్ స్థానంలో వాట్సప్‌నకు సారథ్యం వహిస్తారని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. ప్రస్తుతం క్రెడ్ సీఈవోగా ఉన్న కునాల్ ఆ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. దీంతోపాటు క్రెడ్‌లో రూ. 8,550 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు మెటా ప్రకటించింది.

క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపుల కోసం 2018లో క్రెడ్‌ను స్థాపించారు కునాల్ షా. దేశంలో జరుగుతున్న క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్లలో 40 శాతానికి పైగా క్రెడ్ వేదికగానే జరుగుతు న్నాయి. క్రెడ్‌కు సుమారు 1.7 కోట్ల మంది నెలవారీ యూజర్లుగా ఉన్నారు. గడిచిన 8 ఏళ్లలో కంపెనీని ఈ స్థాయికి తెచ్చిన కునాల్ షా.. ఇకపై వాట్సప్‌ను ముందుండి నడపించనున్నారని మార్క్ జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. "కునాల్ క్రెడ్‌ను భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన టెక్నాలజీ కంపెనీలలో ఒకటిగా తీర్చిది ద్దారు. ఇకపై ప్రపంచంలోనే అతి పెద్ద మెసేజింగ్ యాప్‌ను నడపడంలో ఆయనకున్న నిర్మాణ దృక్పథం, దృష్టికోణం ఎంతగానో ఉపయోగవ డ తాయి. కోట్లాది మంది వాట్సప్ యూజర్లు, లక్షలాది మంది వ్యాపారులకు అత్యుత్తమ సేవలు అందించే ప్రక్రియలో కునాల్‌తో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని జుకర్ బర్గ్ పేర్కొన్నారు. వాట్సప్‌ను లీడ్ చేసే బాధ్యతలు దక్కిన నేపథ్యంలో కునాల్ షా ఎక్స్ వేదికగా క్రెడ్ టీమ్‌నుద్దేశించి పోస్ట్ పెట్టారు. మీ సామర్థ్యానికి పది రెట్లు అధిక స్థాయి పనితీరు కనబరచాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. క్రెడ్ సీఈవోగా కునాల్ షా వైదొలిగిన నేపథ్యంలో కంపెనీ స్ట్రాటజీ, ఫైనాన్స్ బాధ్యతలు నిర్వహిస్తున్న మిథున్ సంపత్ తాత్కాలిక సీఈవోగా వ్యవహరించనున్నారు.

# మార్కెట్‌లోకి స్టైలిష్ బైక్..!



Kawasaki Ninja

మీరు కొత్త సూపర్ బైక్ కొనాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే కవాసకి నుంచి వచ్చిన ఈ లేటెస్ట్ నింజా 500 మీ కోసం ఒక పర్ఫెక్ట్ ఛాయిస్ కావచ్చు. దేశవ్యాప్తంగా మారుతున్న పెట్రోల్ నిబంధనలకు అనుగుణంగా, ఇథనాల్ ఫ్యూయల్‌తో పనిచేసేలా దీన్ని ప్రత్యేకంగా ట్యూన్ చేశారు. క్లాసిక్ లైమ్ గ్రీన్ రంగులో ఆకట్టుకుంటున్న ఈ బైక్ యొక్క టెక్నికల్ అప్‌డేట్స్ మరియు పర్ఫార్మెన్స్ ప్రత్యేకతలను గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాం..

**సరికొత్త ఇంజిన్ అప్‌డేట్**

ఈ బైక్‌లోని అతి ముఖ్యమైన మార్పు దీని ఇంజిన్ ట్యూనింగ్‌లో ఉంది. ఇప్పుడు దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో లభించే జు20 ఫ్యూయల్‌ను తట్టుకునేలా, దీని ఫ్యూయల్ సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేశారు. సాధారణ పాత ఇంజిన్లు అధిక ఇథనాల్ ఉన్న పెట్రోల్‌ను వాడినప్పుడు తుప్పు పట్టడం లేదా పర్ఫార్మెన్స్ తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి. కానీ, ఈ 2026 నింజా 500 ఆ సమస్యలన్నింటినీ అధిగమించి, సుదీర్ఘకాలం మన్నికను అందిస్తుంది.

**పవర్, పెర్ఫార్మెన్స్**

ఈ బైక్‌లో గతంలో మాదిరిగానే శక్తివంతమైన 451఩఩ లిక్విడ్-కూల్డ్ ప్యారలల్-ట్విన్ ఇంజిన్ ఉంది. ఇది 9,000తీజూఎ వద్ద 44.3 ఎప్త్రజూ పవర్ మరియు 6,000తీజూఎ వద్ద 42.6 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ గేర్‌బాక్స్, అసిస్ట్-అండ్-స్లిప్పర్ క్లచ్ ఉండటం వల్ల, రైడింగ్ చాలా సులభంగా, స్మూత్‌గా ఉంటుంది.

డిజైన్, హంగులు

బైక్ లుక్ విషయానికి వస్తే, ఈసారి కవాసకి ప్రత్యేకమైన 'క్లాసిక్ లైమ్ గ్రీన్' కలర్ ఆప్షన్‌ను పరిచయం చేసింది. స్టీల్ ట్రెల్లిస్ ఫ్రేమ్, ఫ్రంట్ టెలిస్కోపిక్ ఫోర్కులు, మరియు 17-అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో ఇది మునుపటిలాగే చాలా అగ్రెసివ్‌గా కనిపిస్తుంది. భద్రత కోసం డ్యూయల్-ఛానల్ ఏబీఎస్ (ూదీూ, రెండు వైపులా డిస్క్ బ్రేకులు ఉన్నాయి. డాష్‌బోర్డ్‌లో బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన ఎల్‌సీడీ యూనిట్ ఉండటం వల్ల రైడర్లకు సమాచారం స్పష్టంగా అందుతుంది.

**ధర, లభ్యత**

ప్రస్తుతం కవాసకి నింజా 500 కేవలం సింగిల్ వేరియంట్‌లో మాత్రమే లభిస్తోంది. దీని ఎక్స్-షోరూమ్ ధర రూ. 5.76 లక్షలుగా నిర్ణయించారు. ఈ బైక్‌కు సంబంధించి బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి, ఈ నెలాఖరు నాటికి డెలివరీలు కూడా మొదలయ్యే అవకాశం ఉంది. మీరు పెర్ఫార్మెన్స్, స్టైల్‌కు ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక ఇంధన నిబంధనలకు అనుగుణంగా ఉండే బైక్ కోసం చూస్తుంటే, 2026 కవాసకి నింజా 500 ఒక గొప్ప ఎంపిక. మీ బైకింగ్ అనుభవాన్ని మరింత ఉత్తేజితం చేయడానికి ఈ సూపర్ బైక్ రెడీగా ఉంది!

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 27-8-2026

## స్వామి ఆశీస్సులతో ప్రజలందరు

# సుఖశాంతులతో వర్ధిల్లాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**
**మరకత లింగ సహిత దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**మల్కాజిగిరి, (సింగిడి) :** కాకతీయ నగర్ డివిజన్ శివనగర్‌లోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిం చిన మరకత లింగ సహిత దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్ర మంను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, శ్రీ విశ్వేశ్వరానంద భారతి స్వామి వారు హాజరై మరకత లింగ సహిత దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి ఆశీస్సులు మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మికత, భక్తి భావాలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఆలయ స్థలదాత, చైర్మన్, గౌరవ అధ్యక్షులు మల్కాజిగిరి శైవ లింగాయత్ సమాజం ఆలూరే అప్పారావు, సరస్వతి దంపతులు, ఆలయ నిర్మాత, సెక్రటరీ, అధ్యక్షులు మల్కాజిగిరి వీరశైవ లింగాయత్ సమాజం ఆలూరే ఈశ్వర ప్రసాద్, స్వప్న దంపతులు పాల్గొని మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. వేద పండితులు మల్లికార్జున స్వామి, కార్తీక్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య మరకత లింగ సహిత దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, తులసి సురేష్, చంద్రమౌళి, బాలకృష్ణ, సాయి సాగర్, సర్వేశ్ యాదవ్, అరుణ్ కుమార్, జేకే సాయి గౌడ్, విజయ రెడ్డి, గోపాల్, ఎం. ఆర్. శ్రీను, సాయి, నర్సింగ్ రావు, వినిత్, భక్తులు పాల్గొన్నారు.

## కాలనీలో సీసీ కెమెరాలు నేరాల నియంత్రణతో..

# ప్రజల భద్రతకు ఎంతో ఉపయోగం

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**
**సోనియా గాంధీ నగర్‌లో ఫేజ్-2 లో సీసీ కెమెరాల ప్రారంభం**




**మల్కాజిగిరి, (సింగిడి) :** కాలనీలలో నేరాల నియంత్రణతో పాటు, ప్రజలకు భద్రతను కల్పించేందుకు ఎంతగానో సీసీ కెమెరాలు ఉపయోగ పడతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేజ్-2 ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ ప్రజల భద్రత, రక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. కాలనీ సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ నాయకులు, సభ్యులు, స్థానిక ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు పాశ్చర్

**టీకాల ఆవిష్కారానికి ఆద్యుడు లూయీ పాశ్చర్. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. లూయీ పాశ్చర్ తయారు చేసిన ఏంటి రేబీస్ వాక్సిన్ని మొట్టమొదటి సారిగా 1885 జూలై 6న వాడారు. ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కని పెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి.**

నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న 'టీకాలు' ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా "వ్యాక్సి నేషన్" ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రించి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం.

లూయీ పాశ్చర్ (డిసెంబరు 27, 1822 -- సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు "పాశ్చరైజేషన్" అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అద్భుత ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం (+వతీవ్ ష్త్రవశీతీఎ శీట ఎఅంమ్ఖుంవ) వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు



ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సీన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు.
పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదు గురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి "స్టీరియో కెమిస్ట్రీ" అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు.

రేబీస్ అనేది వైరస్ ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుంచి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల చేత ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సీన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు.
ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు.
పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమ పదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్థంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపు కుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**

## జడ్చర్లలో మిలాద్-ఉన్-నబీ శాంతి ర్యాలీ.. పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి





**జడ్చర్ల, (సింగిడి) :** మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణంలో ముస్లిం సోదరులు నిర్వహించిన భారీ శాంతి ర్యాలీలో మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం డా. సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, సమభావం, సోదరభావం వంటి విలువలు ప్రపంచానికి ఆదర్శప్రాయమని అన్నారు. మహ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ కలిసిమెలిసి జీవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని ఆయన పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నభీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఫజల్ బంద యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆది వరాహస్వామిని దర్శించుకున్న

# మంథని కోర్టు ఏపీపీ

**మంథని (సింగిడి) :** మంథని కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్థ కుమార్- హాసిని దంపతులు బుధవారం కమాన్పూర్ లోని ఆదివార స్వామి దేవాలయా న్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికారు. ఆల యంలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం ఏపీపీకి దేవుని ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఎస్ ఐ ప్రసాద్ పాల్గొన్నారు.



### ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ మహిళా విభాగం

## రాజకీయంగా ఎదగాలి

**మాసాయిపేట మండల నూతన కమిటీ ఎన్నిక**



**వెల్దుర్తి,(సింగిడి) :** మెదక్ జిల్లా మాసాయిపేట మండల ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ మహిళా విభాగం నూతన కమిటీని జిల్లా మహిళా విభాగం నాయకురాలు మాధవి పల్లెపాటి మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం నాడు మండల కేంద్రంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ...పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలో గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ కార్యక్రమాలలో భాగంగా మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు రావాలని, మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కమిటీ ఎన్నికలో భాగంగా కట్ట పద్మ మాదిగను మాసాయిపేట మండల అధ్యక్షురాలిగా, ముక్క జ్యోతి మాదిగను మండల అధికార ప్రతినిధిగా ఎన్నుకోవడం జరిగిందని, వీరిద్దరిని గ్రామస్థాయి నుండి మండల స్థాయి నాయకత్వంలో ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మాదిగ మహిళా మణులు హాజరవడం జరిగిందని తెలిపారు.

## మాజీ సర్పంచ్ లక్ష్మమ్మకు నివాళులర్పించిన పట్నం అవినాష్ రెడ్డి

**చేవెళ్ళ (సింగిడి) ::** చేవెళ్ళ నియోజకవర్గం షాబాద్ మండలంలోని రుద్రారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ గొల్లగూడెం లక్ష్మమ్మ కు షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి నివాళులర్పించారు. బుధవారం రుద్రారం గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు ప్రస్తుత సర్పంచ్ యాదిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, సంజీవరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులున్నారు..

## జడ్చర్లలో మిలాద్-ఉన్-నబీ శాంతి ర్యాలీ.. పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, (సింగిడి) :** మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణంలో ముస్లిం సోదరులు నిర్వహించిన భారీ శాంతి ర్యాలీలో మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం డా. సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, సమభావం, సోదరభావం వంటి విలువలు ప్రపంచానికి ఆదర్శప్రాయమని అన్నారు. మహ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ కలిసిమెలిసి జీవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని ఆయన పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నభీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఫజల్ బంద యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## కర్ణెతండా ప్రాజెక్టు నాగర్‌కర్నూల్‌లో అంతర్భాగమే

**వనపర్తి బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండించిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు ప్రేమ్ నాయక్**

**బిజినపల్లి, (సింగిడి) :** కర్ణెతండా ఎత్తిపోతల పథకం నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అంతర్భాగమేనని, దీనిపై వనపర్తి బీఆర్ఎస్ నాయకులు అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు ప్రేమ్ నాయక్ అన్నారు. బిజినపల్లి మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజినపల్లి మండలం లట్టుపల్లి ఉమ్మడి రెవెన్యూ గ్రామపంచాయతీ పరిధిలోని అమ్లెట్ గ్రామపంచాయతీ, మీట్యా తండా సరిహద్దుల్లో కర్ణెతండా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ పథకం ద్వారా బిజినపల్లి మండలంలోని తండాలకు సాగునీరు అందించడంతో పాటు వనపర్తి నియోజకవర్గంలోని ఘనపురం, పెద్దమందడి మండలాలకు కూడా నీరు అందుతుందని పేర్కొన్నారు. మొత్తం ఆయకట్టు 4,320 ఎకరాలు అని తెలిపారు. సోమవారం జరిగిన ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని పథకాన్ని ప్రారంభించారని ప్రేమ్ నాయక్ తెలిపారు. ఘనపురం మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేపై హేళనగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా మని అన్నారు. ఈ ప్రాజెక్టు ఏ నియోజకవర్గ పరిధిలో ఉందనే విషయంలో సందేహం ఉంటే బిజినపల్లి, ఘనపురం తహసీల్దార్ల సమక్షంలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో తండాలు ఉండటంతో పాటు, సాగుభూముల్లో గిరిజనుల వాటా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బంజారా ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహారాజ్



పేరును ప్రాజెక్టుకు పెట్టాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచులు ఆమోదించారని తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా బిజినపల్లి మండలానికి సాగునీరు తీసుకురావడంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి కీలకమని ప్రేమ్ నాయక్ పేర్కొన్నారు. సాగునీటి విషయంలో బీఆర్ఎస్ కృషి కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం, వైఎస్ఆర్ చేసిన కృషి ఫలితంగానే నీరు వచ్చిందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను గుర్తుంచుకుని మాట్లాడాలని ప్రేమ్ నాయక్ సూచించారు. సమావేశంలో వాల్యా నాయక్, అమర్ నాయక్, రాజు నాయక్, నరేష్ నాయక్, లోకేష్ నాయక్, రాములు, మాన్యా నాయక్, బాలు నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శేరుపల్లి అభివృద్ధి పనులు చేపట్టాలి

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి గ్రామస్తుల వినతి**




**శ్రీరంగాపూర్, (సింగిడి) :** శేరుపల్లి గ్రామ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ మేకల వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 10వ వార్డు మెంబర్ సురేష్ బాబు, బంగారు బొజ్జన్న, జుర్రు రవీందర్, శటమోని నరేష్ కుమార్‌తో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని వారు కోరారు.

## మరో పోరాటానికి ఎంఆర్‌పీఎస్ కసరత్తు

**సెప్టెంబర్ 9న వరంగల్‌లో జాతీయ మహాసభ.. గ్రామాల్లో యువ కమిటీల ఏర్పాటు**

**భీమదేవరపల్లి, (సింగిడి) :** మరో పోరాటానికి ఎంఆర్‌పీఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేసే దిశగా భీమదేవరపల్లి మండలంలో గ్రామాల వారీగా యువ ఎంఆర్‌పీఎస్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా రాంనగర్, ముస్తాఫూర్, చంటాయపల్లి, రత్నగిరి గ్రామాలకు నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాంనగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కనకం రమేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కనకం రాజు ఎన్నికయ్యారు. ముస్తాఫూర్ కమిటీ అధ్యక్షుడిగా కనకం వినయ్, ఉపాధ్యక్షుడిగా మిడిదొడ్డి సృజన్, ప్రధాన కార్య దర్శిగా మాడుగుల కరుణాకర్ను ఎన్నుకున్నారు. చంటయపల్లి కమిటీ అధ్యక్షుడిగా లింగాల అఖిల్, ఉపాధ్యక్షుడిగా హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా లింగాల అజయ్ ఎన్నికయ్యారు. రత్నగిరి కమిటీ అధ్యక్షుడిగా పొర్నందుల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా చిట్టెంపెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా పొర్నందుల ఆనందు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ, భీమదేవరపల్లి ఎంఆర్‌పీఎస్ కో-ఇన్‌చార్జ్ వేల్పుల ప్రశాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పొర్నందుల సురేష్, తాళ్లపల్లి ఆశీర్వాదం, మాడుగుల ప్రభుదాస్, సిక సురేష్, నాగిన్ల చందర్ తదితరులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే మహాసభకు పెద్దఎత్తున తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



## రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత కానిస్టేబుల్ కోచింగ్..



**కోడేరు (సింగిడి) :** తెలంగాణ రాష్ట్రంలో వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో భాగంగా కొల్లాపూర్ నియో జకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా 100 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్రమంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు నేడు కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ప్రకటించారు. శిక్షణకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, శిక్షణ ప్రారంభ తేది,ఇతర పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు .

## నేటి నుంచి 'సర్ 'వార్డు సభలు

**డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి**

**రాజేంద్రనగర్,(సింగిడి) :** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నేటి నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం నార్సింగ్ సర్కిల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో సంబంధిత బి ఎల్ ఓ వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ జి లక్ష్మారెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాతో ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. షెడ్యూల్ ఆధారంగా ఓటర్ల అభ్యంతరాలపై నోటీసులు అందిన వారికి హియరింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున నిర్ణీత సమయానికి ప్రతి ఒక్కరు హాజరై అవసరమైన ఆధారాలు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి ఎస్ఐఆర్ గ్రామసభలు

**వెల్దుర్తి, (సింగిడి) :** వెల్దుర్తి, మాసాయిపేట, మండలాల్లో యువకులకు మరొక అవకాశం ప్రభుత్వం ఓటు కోసంఎస్ ఐ ఆర్ 2026 పక్రియలో భాగంగా నేటి నుంచి తెలం గాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించుకున్నట్లు తెలం గాణ ఎన్నికల సంఘం తెలిపింది. ఈ గ్రామ సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించడం తోపాటు ఓటర్లు తమ పేర్లు అడ్రసు అభ్యంతరాలు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. 2026 అక్టోబర్ 1 నాటికి 19 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఫారం నెంబర్ సిక్స్ ద్వారా అప్లికేషన్ పెట్టుకోవచ్చన్నారు. ఈ గ్రామ సభల్లో ఓటర్ లిస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఓటరు గ్రామ సభకు హాజరై ఓటు హక్కును పొద్దపరుచుకోవాలని సూచించారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
27-8-2026

## సూరారం ప్రధాన రహదారిపై
# పొంగుతున్న మురుగునీరు

బురద మయంగా మారిన రహదారి.
అవస్థ పడుతున్న వాహనదారులు.
అధికారులు స్పందించి వాహనదారుల ఇక్కట్లు తొలగించాలి.
సామాజిక సేవా కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్.




**కుత్బుల్లాపూర్, (సింగిడి):** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, అధికారులారా సూరారం ప్రధాన రహదారి పై మురు గునీరు ప్రవహించి బురద మయంగా మారిన రహదారులకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం చూపాలని, సమస్యను పరిష్కరించాలని సామాజిక పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ అధికారు లను కోరారు. సూరారం మెయిన్ రోడ్ లో బస్ స్టాప్ వద్ద డ్రైనేజీ నీరు పొంగడంతో ఈ రహదారి గుండా ప్రతినిత్యం వేలాది వాహనాలు వెళుతుండడంతో వాహనదారులకు నరకయాతన



కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బృందమైయంగా మారిన రహదారుల గుండా వాహనాలు సాఫీగా వెళ్లకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ట్రాఫిక్ పోలీసులకు సహితం ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు వెంట ఆరు నెలల నుండి వేసే పైపులైన్ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్త నడకన నడిచి ప్రక్కన ఉన్న పాత డ్రైనేజీ లైన్ పైపులు పగిలిపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. గత ఏడాది రోడ్డుకు ఇటుపక్క నర్సాపూర్ టు బాలానగర్ వెళ్లే రోడ్ లో ( వర్షపు నీటి ) కాలువ నిర్మా ణంతో నెలల తరబడి వాహనదారులు నరకం చూశారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగానే యుద్ధ ప్రాతిపదికన చేపట్టవలసిన పనులు నెలల తరబడి కొనసాగుతుం డడంతో సహనం కోల్పోయిన స్థానిక ప్రజలు అధికారుల తీరును తప్పుపడుతూ తిరగబడడంతో, పై అధికారుల ఒత్తిడితో పని పూర్తి చేసినట్లు రవీందర్ ముదిరాజ్ గుర్తు చేశారు. ప్రతిరోజు, ఉదయం, సాయంత్రం, కిలోమీటర్లమేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ట్రాఫిక్ ను నియంత్రించడం పోలీసులకు తలకు మించిన భారమవుతుంది. ఈ మార్గం గుండా వెళ్లే ద్విచక్ర వాహన దారులు, ఆటోలు అందులో ప్రయాణించే ప్రయాణికుల పై బురద పడి బట్టలు బురదమయంగా మారుతున్నాయన్నారు. ఇదే కాకుండా బస్ స్టాప్ ఎదురుగా ఆర్కే ట్రాన్స్పోర్ట్, ముందర డ్రైనేజీ పైకప్పు లేకపోవడం ప్రమాదకరంగా మారింది. దానిపైన సిమెంట్ కప్పు మూతలు వేస్తున్నారు, ఇక్కడ నిర్మించిన డ్రైనేజీ పై ఇనుపరాళ్లతో ఉన్న స్టీల్ మూత వేయాల్సిన అవసరమున్నదని ఈ విషయాన్ని అధికారులు గుర్తించాలని సూచిం చారు. ఈ రోడ్డు పై వందల టన్నుల బరువైన భారీ, అతి భారీ వాహ నాలు తిరుగడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అధికారులు ఆలోచించి ఈ సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని కోలా రవీందర్ ముదిరాజ్ అధికారులను కోరారు.

# సెల్‌ఫోన్ సిగ్నల్స్ కష్టాలు



**శ్రీరంగాపురం (సింగిడి):** చంద్రమండలానికి రాకెట్లు పంపిస్తున్న ఆధునిక యుగంలోనూ ఓ గ్రామ ప్రజలు కనీస సెల్‌ఫోన్ సిగ్నల్స్ కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో నెల రోజులుగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్య జీవితంలో సెల్‌ఫోన్ వినియోగం అనివార్యంగా మారిన నేపథ్యంలో సిగ్నల్స్ లేకపోవడంతో బంధువు లతో మాట్లాడేందుకు కూడా గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఫోన్ చేసినప్పుడు మాటలు సరిగా వినిపించకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతు న్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేయలేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు, ఇతర విద్యా సమాచారాన్ని పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమైన పనుల కోసం ఫోన్, ఇంటర్నెట్‌పై ఆధారపడే ప్రజలకు సిగ్నల్స్ సమస్య తీవ్ర ఆటంకంగా మారింది. అడవులు, మారుమూల ప్రాంతాల్లో సైతం మొబైల్ సిగ్నల్స్ అందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తాటిపాముల గ్రామానికి మాత్రం సిగ్నల్స్ ఎందుకు అందడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నెల రోజులుగా సమస్య కొనసాగుతున్నప్ప టికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాటిపాముల గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, అత్యవసర ఫోన్ సేవలు, విద్యార్థుల ఆన్‌లైన్ విద్యకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### బొగ్గు లారీల రాకపోకలు..
## రోడ్లకు శాపంగా మారాయా?

- వర్షం వస్తే బురదమయం.. అధికారులు, కంపెనీ యాజమాన్యం తీరుపై తీవ్ర నిరసన
- రోడ్లు ధ్వంసమవుతున్నా పట్టించుకునేదెవరు?
- దబ్బగట్టు రహదారి దారుణం.. అధికారులపై ప్రజల ఫైర్!



**మల్హర్, (సింగిడి):** మండల లోని బొగ్గు లారీల రాకపోకలతో కొయ్యూరు–తాడిచెర్ల రహదారులు ఛిద్రమవు తున్నాయని గ్రామస్థులు మండిపడ్డారు. తాడిచెర్ల సమీ పంలోని ఏఎంఆర్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనికి వెళ్లే భారీ లారీలు, ట్రిప్పర్ల రాకపోక లతో మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని దొబ్బగుట్ట రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని ఆరో పించారు. వర్షం పడితే రహదారి మొత్తం బురదమ యంగా మారి నడవడానికి, వాహనాలు నడపడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు రవాణా కోసం భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నా రహదారుల మరమ్మ తులపై అధికారులు, కంపెనీ యాజ మాన్యం పట్టించుకో వడం లేదని విమర్శిం చారు. సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్థులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు ఎం సి పి ఐ. (సీ )జిల్లా కార్యదర్శి కా. అక్కల బాపు యాదవ్, వార్డు సభ్యుడు బోగే సదానందం, గొట్టం ఎల్లయ్య, ప్రజా సంఘాల నాయకులు రెవెల్లి గట్టయ్య, స్వామిరావు, గడ్డం సదయ్య, పుల్లె రాజమల్లు తదితరులు పాల్గొన్నారు. రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని నాయకులు హెచ్చరించారు.

## వివాహవేడుకల్లో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే



**అల్వాల్, (సింగిడి):** మల్కాజ్‌గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి వెస్ట్ వెంకటాపురం డివిజన్‌లో చిట్టే శివ శంకర్ రెడ్డి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లోతుకుంటలోని శుభశ్రీ గార్డెన్స్‌లో జరిగిన దీపిక–కిరణ్ కుమార్ వివాహ వేడుకకు, మచ్చబొల్లారంలోని తోట పెంట రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన దీపిక–సాయి తేజ గుప్తా వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వివాహ బంధం జీవితంలో ఎంతో పవిత్రమైనదని, నూతన వధూవరులు పరస్పర అవగాహన, ప్రేమ, అనురాగాలతో జీవితాన్ని ఆనందంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, శోభన్ బాబు, భాస్కర్ రెడ్డి, అతిక్ పాషా, మహేష్, సురేష్, జనార్ధన్, సాజిద్, వెంకటేష్, గణేష్ తదితరులతో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఫైనాన్స్ వ్యక్తి ఫ్లెక్సీల దొంగతనం

**చిన్నంబావి, (సింగిడి):** మండల కేంద్రంలో ఇటీవల మంత్రుల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలను మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన ఓ ఫైనాన్స్ నడిపే వ్యక్తి దొంగతనం చేశాడని ఆరోపించిన కాంగ్రెస్ నాయకులు రెండు రోజుల తర్వాత దొంగను గుర్తించారు. అనంతరం ఆవ్యక్తి ఫ్లెక్సీలు తానే దొంగాలించ నాని తప్పును ఒప్పు కోవడంతో సదరు నాయకులకు ఆ ఫ్లెక్సీలకు అయ్యే ఖర్చులో కొంత మెత్తగా రూ. 50,000 వేలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మధ్యవర్తుల ద్వారా రాయబారాలు నడుపుతున్నట్లు సమాచారం.

# ప్రశాంతంగా ముగిసిన మిలాద్–ఉన్–నబీ వేడుకలు
### పోలీసుల పటిష్ట బందోబస్తు.. ప్రశాంతంగా ముగిసిన వేడుకలు

**వెల్దుర్తి, (సింగిడి):** మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా ముగిశాయి. వెల్దుర్తి, రామంతపూర్, మెదక్ టౌన్, చేగుంట, శంకరంపేట–ఏ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు. ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు,



మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజ



లకు జిల్లా పోలీసు శాఖ కృతజ్ఞతలు తెలిపింది. పోలీసు లకు సహకరించిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువ జన సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను అధికారులు అభినందించారు. జిల్లాలో అన్ని పండుగలను శాంతియు తంగా, సోదరభావంతో నిర్వహిస్తూ మెదక్ జిల్లా ప్రశాంత తకు ప్రజలు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

### జడ్చర్లలో మిలాద్–ఉన్–నబీ ర్యాలీలో
## పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల (సింగిడి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్ర మిలాద్–ఉన్–నబీ ర్యాలీలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముస్లిం సోదరులకు మిలాద్–ఉన్–నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, ప్రేమ, సహనం, మానవత్వం వంటి విలువలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజలంతా పరస్పర గౌరవం, ఐక్యతతో ముందుకు సాగుతూ జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మిలాద్–ఉన్–నబీ ర్యాలీ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.


## ఆయుర్వేద మూలికలు అమ్మే గుడిసెలో... మహిళ మృతదేహం లభ్యం
### కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జవహర్ నగర్, (సింగిడి):** జవహర్ నగర్ చెన్నాపురం సమీపంలోని భాగ్యనగర్ కాలనీ మెయిన్ రోడ్ లో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని చెన్నాపురం సమీపంలోని భాగ్యనగర్ కాలనీ రహదారి పక్కన ఉన్న ఓ ఆయుర్వేద గుడి సెలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కలకలం రేపింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బందికి బుధవారం సుమారుగా రెండు గంటల సమయాన సురేష్ అనే వ్యక్తి పబ్లిక్ కాల్ ద్వారా సమాచారాన్ని అందించాడు. చెన్నాపురంలోని భాగ్యనగర్ కమాన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఆయుర్వేద వనమూలికలు అమ్ముకునే గుడిసెలో గుర్తు తెలియని మహిళ



శవం పడి ఉండగా వెంటనే సమాచారం అందించాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తుతెలియని మహిళ మృతదేహం రోడ్డు పక్కన ఉన్న చిన్న టెంట్ కింద పడి ఉందని గుర్తించి మృతదేహం సుమారుగా నాలుగు నుండి ఐదు రోజుల క్రితం మృతి చెందినట్లుగా నిర్ధారించారు. కుళ్ళిపోయి ఉబ్బిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి సదరు మహిళ అప్పటికే మృతి చెందినదిగా గుర్తించి సంఘటనా స్థలంలో స్థానిక ప్రజలను విచారించగా మృతురాలు గత కొంతకాలంగా పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ ఫుట్పాత్ పై నివసిస్తుండేదని తెలిసింది. అయితే ఆమె పూర్తి పేరు చిరునామా ఇతర వ్యక్తిగత వివరాలు తెలియ రాలేదు. ఈ మేరకు మృతురాలి ఇతర వివరాలు తెలియకపోవడంతో ఆమె మరణానికి గల కారణాలు మృతి చెందిన పరిస్థితులు వివరాలు తెలియాల్సి ఉంది కావున ఈ విషయమై కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కొడంగల్ లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**కొడంగల్, (సింగిడి):** మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లింలు జరుపుకునే మిలాద్ ఉన్ నబీ వేడుకలు కొడంగల్ లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం సమయంలో జామే మసీదులో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అంబేద్కర్ కూడలిలో పావురాలను ఎగురవేసి శాంతి సందేశాన్ని వ్యక్తం చేశారు. సాయంత్రం వేళలో మక్కా, జామే మసీదు లలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పర్వదినం సందర్భంగా ఎస్బి గుల్షన్ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై సత్యనారాయణ లను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆఫీస్ షేక్ ఆదిల్, ఆఫీస్ అజీజ్, ఎస్ ఎస్ కె సలీం, షాకీర్ ఖాద్రీ, ఫెరోస్ ఖాన్, సయ్యద్ అశ్ఫక్ పాషా, ఇందనూర్ బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## 15వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**కల్వకుర్తి (సింగిడి):** హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఓ వార్త పత్రిక 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు పత్రిక ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సమాజ అభివృద్ధి కోసం నిష్పక్షపా తంగా వార్తలను ప్రజలకు చేరవేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆదాబ్ హైదరాబాద్ పత్రిక 15 సంవత్సరాలుగా ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, రాజకీయ పరిణామాలు స్థానిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంలో తనదైన పాత్ర పోషిస్తోందని పలువురు వక్తలు కొనియాడారు. భవిష్యత్తులో కూడా ప్రజల గొంతుకగా మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ ఆదాబ్ హైదరాబాద్ పత్రిక కల్వ కుర్తి ఇంచార్జ్ పిప్పళ్ళ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాచుపల్లి ఆకృతి కన్స్ట్రక్షన్‌పై పోలీస్ కేసు నమోదు.



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లి ఆకృతి కన్స్ట్రక్షన్ రోడ్డు స్థలం ఆక్రమించుకొని వాడకంపై గత నెల రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా 24/8/2026 ఆకృతి కన్స్ట్రక్షన్ పై బాచుపల్లి పోలీస్ అధికారులు ఎఫ్ ఐ ఆర్(777/2026) నమోదు చేయడం జరిగింది. ఇప్పటికైనా ఆకృతి కన్స్ట్రక్షన్ ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని అప్రోచ్ రోడ్ గా చూపించుకొని అనుమతులు, నిర్మాణంపై మేము చేసిన పోరాటం నిజమైందని, గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆకృతి కన్స్ట్రక్షన్ పై పోరాడితే అక్రమ కేసులు పెట్టిన వారికి ఈ కేసు నమోదుతో చెంపదెబ్బ లాంటిదని ఆకుల సతీష్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆకృతి కన్స్ట్రక్షన్ అప్రోచ్ రోడ్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని వివరించారు.

## పాముకాటు బాధితుడిని కాపాడిన యశోద ఆసుపత్రి వైద్యులు

**కల్వకుర్తి (సింగిడి):** పాముకాటుతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఓ వ్యక్తికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సకాలంలో అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. కల్వకుర్తి డివిజన్ పరిధిలోని వంగూరు ప్రాంతానికి చెందిన శేఖర్ పాము కాటుకు గురై నాడీ వ్యవస్థ, శ్వాసకోశం, గుండె పనితీరు తీవ్రంగా దెబ్బతి నడంతో విషమ పరిస్థితిలో ఆసుపత్రికి చేరుకున్నారు.
ఛాతీనొప్పి, స్పృహ కోల్పోవడంతో శేఖర్‌ను యశోదా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో న్యూరోటాక్సిక్ స్నేక్ ఎన్వెనమేషన్, అక్యూట్ ఎన్సెఫలోపతి, తీవ్రమైన శ్వాస వైఫల్యం, గుండె ఎడమ జఠరిక పనితీరు గణనీయంగా తగ్గడం వంటి సమస్యలను వైద్యులు గుర్తించారు.
పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వైద్యులు వెంటనే రోగిని వెంటిలేటర్‌పై ఉంచి, యాంటీ స్నేక్ వెనమ్ అందించారు. క్రిటికల్ కేర్ విభాగంలో నిరంతర మానిటరింగ్‌తో చికిత్స కొనసాగించారు. చికిత్సకు రోగి క్రమంగా స్పందించడంతో నాడీ వ్యవస్థ, స్పృహలో గణనీయమైన మెరుగుదల



కనిపించింది. శ్వాసకోశ పనితీరు మెరుగుపడటంతో కొంతకాలం తర్వాత వెంటిలేటర్ నుంచి రోగిని విజయవంతంగా బయటకు తీసుకువచ్చారు. గుండె పనితీరు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతలను సైతం వైద్యులు సమర్థవంతంగా నియంత్రించడంతో శేఖర్ ఆరోగ్యం క్రమంగా స్థిరపడింది. ప్రస్తుతం ఆయన పూర్తిగా కోలుకుని, స్థిరమైన ఆరోగ్యంతో ఇంటికి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు డా. రంగా సంతోష్ కుమార్, డా. కళాధర్, డా. శబరీనాథ్ సముద్రాల మాట్లాడుతూ.. న్యూరోటాక్సిక్ పాము విషం నాడులు, కండరాల పనితీరును తీవ్రంగా దెబ్బతీసి ప్రాణాపాయ పరిస్థితికి దారితీయవచ్చని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో సకాలంలో యాంటీ స్నేక్ వెనమ్ ఇవ్వడం, శ్వాసకోశానికి అవసరమైన సహాయక చికిత్స అందించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.
యశోదా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిటూరి మాట్లాడుతూ.. వివిధ వైద్య విభాగాల సమన్వయం, అత్యాధునిక ఐసీయూ సదుపాయాలు, మెకానికల్ వెంటిలేషన్, నిరంతర మానిటరింగ్ ద్వారా విషమ పరిస్థితుల్లో ఉన్న రోగులకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సకాలంలో సరైన వైద్యం అందితే పాముకాటు బాధితుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని, పాము కాటుకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలోని అత్యవసర వైద్య సదుపాయం ఉన్న ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు.

# నాణ్యమైన వస్తువులు అందిస్తూ ఆదరణ పొందాలి

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

**సుల్తానాబాద్‌లో షాపింగ్‌కు సరికొత్త చిరునామా 'ఆగో మోర్ ఫ్రెష్' అదిరిపోయే ఎంట్రీ**





**సుల్తానాబాద్, (సింగిడి):** నాణ్యమైన వస్తువులు అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సూ పర్ మార్కెట్ నిర్వాహకుడు బుర్ర సంతోష్‌కు సూచించారు. బుధ వారంసుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆగోమో ర్ ఫ్రెష్' సూపర్ మార్కెట్ ఘనంగాప్రారంభమైంది. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజ య రమణారావు స్థానిక నాయకులతో కలిసి సూ పర్ మార్కెట్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శు భాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రజలకు నిత్యావస ర వస్తువులు, వివిధ రకాల ఉత్పత్తులను ఒకే వే దికపై అందుబాటులోకి తీసుకురావడం అభినంద నీయమని నాయకులు పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ వినియోగదారుల విశ్వాసం, ఆదరణ చూరగొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అం తటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కౌన్సి లర్లు వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్, గరిగే శోభారా ణి శ్రీనివాస్, గాదాసు మంజుల రవి, కాంగ్రెస్ నా యకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మధుమేహంతో కిడ్నీలపై ముప్పు




**మంచిర్యాల,(సింగిడి):** చక్కెర వ్యాధి... పేరు చిన్నదే అయినా ప్రభావం మాత్రం శరీరంలోని కీలక అవయవాలపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా మధుమేహం కిడ్నీల పనితీరును క్రమంగా దెబ్బతీస్తూ చివరకు తీవ్ర సమస్యలకు దారితీసే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీల్లో మార్పులు వచ్చినా ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవడంతో చాలా మంది ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తున్నారని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్, కిడ్నీ మార్పిడి వైద్యులు డాక్టర్ ప్రణీత్‌రామ్ తెలిపారు. బుధవారం మంచిర్యాలలో మీడియాతో ఆయన మాట్లాడారు. మధుమేహం ఉన్నవారు కిడ్నీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కిడ్నీల పనితీరులో మార్పులను సూచించే చిన్నచిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయరాదన్నారు.

**ఆ లక్షణాలుంటే నిర్లక్ష్యం వద్దు**

కాళ్లు వాపు రావడం, కళ్లు మసకబారడం, శరీరంలో అసాధారణ మార్పులు కనిపించడం, రాత్రివేళల్లో తరచూ మూత్ర విసర్జన చేయాల్సి రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇవి కిడ్నీల పనితీరులో మార్పులకు సంకేతాలు కావచ్చన్నారు. సకాలంలో పరీక్షలు చేయించుకుని సమస్యను గుర్తిస్తే మరింత తీవ్ర దశకు వెళ్లకుండా నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**ముందస్తు జాగ్రత్తే మేలు**

మధుమేహం ఉన్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ ప్రణీత్‌రామ్ సూచించారు. కిడ్నీల పనితీరును అంచనా వేసేందుకు అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను తొలిదశలోనే గుర్తించవచ్చన్నారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడటంతో పాటు జీవనశైలిలోనూ అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు.

**చివరి దశలో మార్పిడి**

కిడ్నీల సమస్య తీవ్రతను బట్టి చికిత్స విధానాన్ని వైద్యులు నిర్ణయిస్తారని తెలిపారు. మందులు, ఇతర చికిత్సా విధానాలతో సమస్యను నియంత్రించలేని పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి అవసరం కావచ్చన్నారు. ఆధునిక వైద్య విధానాలతో కిడ్నీ మార్పిడి ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని చెప్పారు.

**పేదలకు అందుబాటులో వైద్యం**

కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఖరీదైన చికిత్స అవసరమయ్యే పరిస్థితులు ఉన్నందున పేద, మధ్యతరగతి ప్రజలకు కూడా మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ ప్రణీత్‌రామ్ సూచించారు. వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కోసం ఇబ్బందులు పడటం కంటే ముందుగానే అప్రమత్తమై పరీక్షలు చేయించుకోవడం ఎంతో మేలన్నారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి సికింద్రాబాద్ ఇన్‌చార్జి మేనేజర్ అంకం మల్లేష్ పాల్గొన్నారు.

# మత సామరస్యానికి మధుర సందేశం




**మంచిర్యాల, (సింగిడి):** మతాలకతీతంగా మానవత్వమే గొప్పదన్న సందేశాన్ని చాటుతూ మిలాద్-ఉన్-నబీ ర్యాలీ మంచి ర్యాలలో ఉత్సాహంగా సాగింది. బెల్లంపల్లి చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మధుకర్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీకి వివిధ వర్గాల ప్రజలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మధుకర్ మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ చూపిన ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, స్నేహభావం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లిం సోదరులకు పండ్లను పంపిణీ చేశారు. పండుగ వేళ ఒకరినొకరు పలకరించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకోవడం అక్కడ ఆత్మీయ వాతావరణాన్ని నెలకొల్పింది. చిన్న సహాయం అయినా ఆప్యాయతతో అందిస్తే అది మానవ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందనే భావన కార్యక్రమంలో కనిపించింది. పండుగలు కేవలం మతపరమైన వేడుకలకే పరిమితం కాకుండా, ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, సామాజిక ఐక్యతను పెంచే వేదికలుగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. మంచిర్యాల ప్రజల మధ్య ఉన్న మత సామరస్యం, పరస్పర సహకారం ఇలాంటి కార్యక్రమాలతో మరింత బలపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో కొలువైన దుర్గాదేవి



**మంచిర్యాల, (సింగిడి):** సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గాదేవి (మైసమ్మ) ఆలయ ప్రారంభోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జీఎం కార్యాలయం, ఎస్అండ్‌పీసీ సిబ్బంది సహకారంతో మూడు నెలల్లోనే ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ ప్రారం భోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, ఇతర క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉత్పత్తి నిలిచిపోయిన ఆర్కే-6 గని ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని జీర్ణోద్ధారణ క్రతువు నిర్వహించి జీఎం కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం మూడు రోజుల పాటు అమ్మవారి మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నిర్ణీత ముహూర్తానికి గర్భగుడిలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జీఎం దంపతులు మునిగంటి శ్రీనివాస్ - ఉమారాణి, ఎస్ఓటూ జీఎం కృష్ణప్రసాద్, రిటైర్డ్ ఎస్ఓటూజీఎం ఎన్.సత్యనారాయణ, ఐకే ఓసీ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఎస్అండ్‌పీసీ గార్డు మల్లికార్జున్ దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా అభివృద్ధి, ఉత్పత్తి, భద్రతతో పాటు కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంకల్పం బలంగా ఉంటే ఎంతటి పనినైనా సులభంగా పూర్తి చేయవచ్చనడానికి ఈ ఆలయ నిర్మాణమే నిదర్శనం అన్నారు. ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మూడు నెలల్లోనే ఎలాంటి విఘ్నాలు, ఆటంకాలు లేకుండా పనులు పూర్తి చేసి ప్రారంభించుకోవడం విశేషం అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో శ్రీరాంపూర్ ఏరియాకు సింగరే ణిలో ఉత్పత్తి, భద్రతలో మంచి పేరు రావాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములైన జీఎం కార్యాలయం, ఎస్అండ్‌పీసీ సిబ్బందితో పాటు విరాళాల రూపంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ జీఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

# కౌటాలలో కాంగ్రెస్ మండల సర్వసభ్య సమావేశం

**మండల కమిటీ ఎన్నికకు దరఖాస్తుల స్వీకరణ**




**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):** సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా బుధవారం కౌటాల మండల కాంగ్రెస్ కమిటీ ఎన్నికల ప్రక్రియపై మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నికోడే గంగారాం అధ్యక్షతన జరిగిన సమావేశానికి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ కమిటీ ఎన్నికల ప్రక్రియపై నాయ కులు, కార్యకర్తలతో వారు చర్చించారు. మం డల కమిటీలో వివిధ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఆత్రం సుగుణ, ఎమ్మెల్సీ దండే విఠల్ సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవ య్య, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం జానకీరావు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో బొంతకుంటపల్లిలో సంక్షేమానికి కొత్త ఊపు

**అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యం**

**సర్పంచ్ పోలాడి శ్రీరంగారావు**




**సుల్తానాబాద్,(సింగిడి):** సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి గ్రామం లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘ నంగా నిర్వహించారు. సర్పంచ్ పోలాడి శ్రీరంగారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజే శారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోలాడి శ్రీరంగా రావు మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుం బానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజ నాలు అందేలా పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందే అవ కాశం ఉంటుం దని పేర్కొన్నారు. గ్రామంలోని ఏ ఒక్క అర్హకుటుంబం సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజల అవ సరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమం లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయం గా గ్రామాభివృద్ధికి పా లకవర్గం సమష్టిగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు పాల్గొని అర్హులైన ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్డులు అందుకున్న లబ్ధిదారు లు సంతోషం వ్యక్తం చేశారు.

# శిథిలావస్థలో ప్రభుత్వ ఆసుపత్రి.. పేదలకు వైద్యం భారమే!

**వైద్యులు, సిబ్బంది కొరతతో శస్త్రచికిత్సలకు దూరం**

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**



**మంచిర్యాల, (సింగిడి):** మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థకు చేరినా ప్రభుత్వం పట్టించుకో వడం లేదనీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘు నాథ్ వెరబెల్లి ఆరోపించారు. ఆసుప త్రిలో ఏ సమయంలో ఎక్కడ స్లాబ్ కూలుతుందోనన్న భయంతో వైద్యులు, సిబ్బంది, రోగులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వివిధ వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు.

**ప్రతి వార్డులో ఇదే పరిస్థితి..**

ఆసుపత్రిలోని పలు వార్డుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నా కనీస మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళనతో రోగులు చికిత్స పొందాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

**డయాలసిస్ వార్డులో మరింత దారుణం**

డయాలసిస్ వార్డు పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. స్లాబ్ దెబ్బతినడంతో మెష్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారని, రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో ఇలాంటి పరిస్థితులు ఉండటం బాధాకరమన్నారు.

**వైద్యులు లేక.. శస్త్రచికిత్సలు దూరం**

ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పలు వైద్య సేవలు అందుబాటులో లేకుండా పోయాయని ఆరోపించారు. ముఖ్యంగా శస్త్రచికిత్సలు చేయలేని పరిస్థితి ఏర్పడటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటే ఎంతోమంది పేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు.

**కొత్త భవనంలోకి త్వరగా మార్చాలి**

కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి, ప్రస్తుత ఆసుపత్రిని అక్కడికి తరలించాలని డిమాండ్ చేశారు. నూతన భవనంలో అన్ని రకాల వైద్య సేవలు, అవసరమైన మౌలిక వసతులు, సరిపడా వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమిరిశెట్టి రాజ్‌కుమార్, రంగ శ్రీశైలం, కుర్రె చక్రవర్తి, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బొట్ల సత్యం, డేగ బాపు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి ఆర్థిక భరోసా..






## అగో మోర్ ఫ్రెష్'కు శ్రీకారం

**సుల్తానాబాద్, (సింగిడి):** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి ద్వారా వారి కుటుంబాల కు అండగా ని లపడమే తెలంగాణ ప్రభుత్వ ఇందిరా మహిళా శక్తి లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వి జయర మణారావు అన్నారు. సుల్తానా బాద్ మం డల కేంద్రంలో అమ్మ భగవాన్ సంఘానికి చెందిన గడ్డం అనూషకు శ్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రుణంతో ఏర్పాటు చేసిన 'అగో మోర్ ఫ్రెష్' సూపర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే విజయరమ ణారా వు, మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధా కృష్ణ, వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత లు ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యం లో జీవనోపాధి కోసం అనూషకు రూ. 5 లక్షల శ్రీనిధి రుణం, రూ. 2 లక్షల బ్యాంకు లింకేజీ రుణం మంజూరు చేశారు. మొ త్తం రూ. 7 లక్షల ఆర్థిక సహాయంతో సూపర్ మా ర్కెట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ప్రభుత్వం అంది స్తున్న ప్రోత్సాహా నికి ఇది నిదర్శనంగా నిలిచిం ది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూ డకుండా ప్ర భుత్వ సహకారంతో స్వయం ఉపాధి మార్గా లను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాలకు అవసరమైన రుణాలు, శిక్ష ణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తూ ప్రభు త్వం అండగా నిలుస్తోందన్నారు. 'అగో మోర్ ఫ్రెష్' సూపర్ మార్కెట్ ద్వారా అనూషకు స్థిరమైన ఆదాయ మార్గం ఏర్పడ టంతో పాటు స్థానిక ప్ర జలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. మహిళల ఆత్మవిశ్వా సానికి, స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు మరింత ఊతమి స్తాయని అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకా రాన్ని సద్వినియోగం చేసుకుని మరింత మంది మహిళలు వ్యాపార రంగంలో ముందుకు రావా లని ఎమ్మెల్యే విజయర మణారావు పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఈవో స్వ రూప, మెప్మా పట్టణ అధ్యక్షురాలు బండ మాధవి, గిరుగుల లక్ష్మి, గొట్టె సరిత, ఆర్‌పి బైరగోని స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పదును.. క్రీడలకు ఎస్ ఎన్ ఆర్ స్పోర్ట్స్ అకాడమీ

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**





**సుల్తానాబాద్, (సింగిడి):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించా లని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ గాంధీన గర్‌లో కోచ్ బొల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏ ర్పాటు చేసిన ఎస్ఎన్ఆర్ టేబుల్ టెన్నిస్, చెస్ స్పోర్ట్స్ అకాడమీని మున్సిపల్ చైర్‌పర్సన్ బిరు దు కృష్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్న య్యగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమ శిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. చిన్ననాటి నుంచే ప్రతిభను గుర్తించి శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. సుల్తానాబాద్‌లో ప్ర త్యేకంగా టేబుల్ టెన్నిస్, చెస్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అకా డమీని విద్యార్థులు, యువ క్రీడాకారులు సద్విని యోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ కాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీ డా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, విద్యార్థులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మంచరామిలో సంక్షేమానికి 'స్మార్ట్' అడుగు

**అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు: సర్పంచ్ ఉప్పు లక్ష్మి**



**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ మండలం మంచ రామి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఉప్పు లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజే శారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్ర యోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు రేషన్ సేవలు మరింత సుల భంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉప యోగపడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమం లో ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు పాల్గొని ప్రజలకు కార్డులను పంపిణీ చేశారు. గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలా లు అందేలా పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుం దని తెలిపారు.

# ప్రజా ప్రయోజనమే ప్రథమ లక్ష్యం

**బెల్ట్ షాపులకు బెల్ మోగించిన నీరుకుల్ల పాలకవర్గం**

**షాపులు మూసివేయాలని ఏకగ్రీవ తీర్మానం**

**ప్రజా శ్రేయస్సుకోసం తీసుకున్న నిర్ణయం**

**నీరుకుల్లలో ప్రశాంత వాతావరణమే లక్ష్యం**

**వెనక్కి తగ్గేదే లేదు: యువ సర్పంచ్ కాంపెల్లి సతీష్ కుమార్**





**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో వి చ్చలవిడిగా కొనసాగు తున్న బెల్ట్ షాపులకు అ డ్డుకట్టవేసేం దుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో బెల్ట్ షాపు లను మూసివేయాలని సర్పంచ్ కాం పేల్లి సతీష్ కుమార్, పాల కవర్గం, పంచాయతీ కార్యదర్శి ఆ ధ్వర్యంలో తీర్మానం చేసి, సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పాలకవర్గంతీసుకున్న ఈ నిర్ణ యం గ్రామంలో చర్చనీయాంశం గా మారింది.

**మహిళలు, యువత భద్రతే లక్ష్యం..**

బెల్ట్ షాపుల కారణంగా గ్రామంలో మహిళలు, పి ల్లలు, యువత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితు లు తలెత్తకుండా చూడటంతో పాటు, ప్రజారోగ్యం, శాంతిభద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణ యం తీసుకున్నట్లు సర్పంచ్ కాం పెల్లి సతీష్‌కుమా ర్ తెలిపారు. గ్రామ ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థ నలు, ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసు కుని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నా రు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..**

నిబంధనలకు విరుద్ధంగా కొనసాగు తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసి వేసేలా సంబంధిత శా ఖల అధికారు లు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. గ్రామ పంచాయతీ తీర్మానా న్ని అధికారు లు పరిగణనలోకి తీసు కుని అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో అక్రమ మ ద్యం విక్రయాలకు తావులేకుండా, ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పేందుకు అందరూ సహకరిం చాలని కోరారు.

**ప్రజల సహకారంతో ప్రశాంత నీరుకుల్ల..**

గ్రామాభివృద్ధి అంటే కేవలం రోడ్లు, డ్రైనేజీలు, మౌ లికవసతులకే పరిమితం కాదని, ప్రజలకు ఆరోగ్యక రమైన ప్రశాంతమైన వాతావరణం కల్పించడమూ పాలకవర్గం బాధ్యతేనని సతీష్‌కుమార్ పేర్కొన్నా రు. ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో పె ట్టుకుని మద్యం విక్రయాల నియంత్ర ణకు ప్రజలు కూడా సహకరిం చాలని కోరారు. గ్రామంలో బెల్ట్ షాపులపైపాలకవర్గం తీసుకున్న నిర్ణయంం కఠ్చం దీగా అమలయ్యేలా అధికారులు సహకరించాల ని, ప్రజా ప్రయోజనా లకు సంబంధించిన ఈ అంశా న్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా ప్రతినిధు లు కూడా సహకరించాలని సర్పంచ్ కాంపెల్లి సతీ ష్‌కుమార్ కోరారు. ప్రజల శ్రేయస్సు కోసం తీసుకు న్న నిర్ణయంలో వెనక్కి తగ్గేది లేదు అని, నీరుకుల్లలో ప్రశాంత వాతావరణమే లక్ష్యం" అని సర్పం చ్ స్పష్టం చేశారు.

# పశువుల దొంగలను పట్టుకున్న బొంరాస్ పేట్ పోలీసులు

## -నిందితులపై పిడి అక్ట్ తోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు
## - వెల్లడించిన ఎస్సై బాలవెంకటరమణ

**కొడంగల్, (సింగిడి):** వికారాబాద్ జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో వరుసగా పశువులు ( మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు) దొంగతనాలకు గురి అవుతడండంతో పశువుల యజమానులు పోలీసు కేంద్రంలో ఫిర్యాదు చేస్తున్నారు. పశువుల యజమానుల నుంచి వస్తున్న ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులకు పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. బొంరాస్ పేట్ పోలీసు స్టేషన్ ఎస్సై బాలవెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.... నిందితులను పట్టుకునేందుకు తన బృందంలోని కె. బాలు, కె. బాలయ్య,ఎరుకలి శ్రీనివాస్ లను మఫ్టి లో పంపగా ఈనెల 25 వ తేదీ మంగళవారం రోజు బొంరాస్ పేట్ శివారులో గల చెరువు దగ్గర జాతీయ రహదారి 163పై అనుమాస్పదం గా తిరుగుతున్న తెలుపు రంగు గల స్కార్పియో కారు ను తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా పోలీసు లను చూసిన దుండగులు పారిపోతుంటే పోలీసులు వెంబడించి పట్టుకుని బొంరాస్ పేట్ పోలీసు స్టేషన్ కి తీసుకుని వచ్చారు. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, డిఎస్పీ శ్రీనివాస్, సిఐ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు స్కార్పియో కారు లో ఉన్న వ్యక్తి ని విచారించగా వ్యక్తి పేరు మహమ్మద్




సల్మాన్ అలియాస్ సల్మాన్, ఇంటినెంబర్ 18-8-589/100,మోయింబాగ్, కుమార్వాడి, యాదిబజార్, ఛార్మినార్, హైదరాబాద్ వాసిగా పేర్కొన్నారు. అతని తోపాటు అతని స్నేహితులు హర్యానా కి చెందిన సౌకత్, తాహీర్, సాబీర్, నట్టా లు మద్యం త్రాగుటకు, జల్సాలు చేసేందుకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు, మధ్యరాత్రి సమయం లో ప్రజలంతా నిద్రలోకి జారిన తర్వాత ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వివరాలు సేకరించారు. పైన పేర్కొన్న దుండగులు వికారాబాద్ జిల్లాలోని బొంరాస్ పేట్, పరిగి, చన్ గోముల్, దోమ, కుల్కచర్ల, దుద్యాల, ధరూర్, బంట్వారం, పెద్దేముల్,నారాయణ పేట్ జిల్లా లోని కోస్గి,మెదక్ జిల్లాలోని శంకరం పేట్-ఏ, యాదాద్రి భువనగిరి జిల్లా లోని యాదగిరి గుట్ట పరిధిలో, కామారెడ్డి జిల్లాలోని నిజాం సాగర్ మండల పరిధిలో, ఫ్యూచర్ సిటీ పరిధిలోని చేవెళ్ల, శంకర్ పల్లి, ప్రాంతాల్లో పశువుల దొంగతనాలు చేసి, దొంగిలించిన పశువులను తెలుపు రంగు స్కార్పియో వాహనంలో హైదరాబాద్ మరియు యాదగిరి లోని సంతలో అమ్ముకుంటున్నట్లు నిందితులు వివరించినట్లు నుండి ఎస్సై బాలవెంకటరమణ తెలిపారు. విచారణ అనంతరం మహమ్మద్ సల్మాన్ అలియాస్ సల్మాన్ దగ్గర 3,55,000 రూపాయలు స్వాధీన పరుచుకుని నిందితులపై కేసు నమోదు చేసి,సల్మాన్ ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న నలుగురు దుండగులపై పిడి యాక్ట్ నమోదు చేయడం జరిగిందని, పరారిలో ఉన్న నలుగురు దుండగులను కూడా పట్టుకుని కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

# సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సేవ భవాని పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యం

## కాంగ్రెస్ పార్టీ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్

**మల్కాజిగిరి, (సింగిడి):** ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మౌలాలి డివిజ న్‌లో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ అనేది ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జన్మదినాన్ని స్మరించుకుంటూ, ప్రేమ, శాంతి, సోదరభావం, దయ, మానవతా విలువలను చాటే పవిత్రమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్ మాట్లా డుతూ సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సేవాభావాన్ని పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమైనదన్నారు. అనంతరం మౌలాలి డివిజన్‌లో షర్బత్ పంపిణీ, భరత్ నగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎం.జె.




కాలనీలోని మహమూద్ మసీదు నుండి కాప్రా మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, విజయ్, పోలీస్ సిబ్బంది,



తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫారూఖ్, మౌలాలి డివిజన్ మైనార్టీ ప్రెసిడెంట్ షకీల్, సిద్దిక్, నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

31న స్థానిక సమస్యల పై తహశీల్దార్

# కార్యాలయాల ముందు ధర్నా

సి.పి.ఐ.ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ.




**ఇబ్రహీంపట్నం, (సింగిడి):** ఈ నెల 31న రంగా రెడ్డి జిల్లా లోని అన్ని తహశీల్దార్ కార్యాలయల ముందు స్థానిక సమస్యల పై ధర్నా చేయాలని సి. పి. ఐ. ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రా హీం పట్నం పాషా,నరహరి స్మారక కేంద్రంలో సి. పి. ఐ. ఎం పార్టీ రంగా రెడ్డి జిల్లా వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న రంగా రెడ్డి జిల్లా లోని అన్ని మండల కేంద్రాల్లో తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించాలని ,అంతే గాక సెప్టెంబర్ 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీ ల ముందు స్థానిక సమస్యల పై ధర్నా కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ళ భాస్కర్,బి. సామెల్,ఎం. చంద్ర మోహన్,డి. రామచందర్, కందుకూరి జగన్,జిల్లా కమిటి సభ్యులు అలంపల్లి నర్సింహ,రావుల జంగయ్య,సి. ఎచ్. బుగ్గరాములు, పి. అంజయ్య, సి. ఎచ్ జంగయ్య,గోరెంకాల నర్సింహ ,జే. రుద్రకుమార్,డి. కిషన్,పి. ఎన్. ఎం జిల్లా అధ్యక్షురాలు కే. శారద,వివిధ మండల నాయకులు,శాఖ కార్యదర్శి లు తదితరులు ఉన్నారు.

మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో

# పయనించాలి: మత గురువులు





**ఆమనగల్లు,(సింగిడి):** మానవులంతా ఒక్కటే నని తారతమ్య బేదం లేకుండా శాంతి, దానం, దైవభీతితో మెలగాలని మహ్మద్ ప్రవక్త బోదించారని ప్రతి ఒక్కరు ఆదిశలో పయనించాలని మత గురువులు అబ్దుల్ వాహిద్, లతీఫ్ లు కోరారు. మంగళవారం రాత్రి మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని మిలాద్ ఉన్ నబి పండుగను ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జామా మస్జిద్, మహ్మదీయ మస్జిద్, మస్జీదే హిలాల్ లను విద్యుత్ దీపాలతో అలకరించి ప్రతేక ప్రార్ధనలు, దువ్వాలు నిర్వహించి జాగరణ చేశారు. మత గురువులు మాట్లాడుతు సమాజంలో శాంతి నెలకొల్పేందుకు, సర్వ మానవాళి శ్రేయస్సు కోసం అల్లా ఆఖరి ప్రవక్తగా జన్మించారని అందుకు అంతిమ దైవ గ్రంథమైన ఖురాన్ తెలిపారని ఆయన చెప్పారు. మహ్మద్ ప్రవక్త యొక్క సూక్తులను బయాన్ ద్వారా ముస్లీం సోదరులకు వివరించారు. మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్క ముస్లీం నడిచినపుడే జీవితం సార్ధకం అవుతుందన్నారు. శాంతికి చిహ్నమైన మహ్మద్ ప్రవక్త జన్మదినం రోజున ప్రతి ఏటా మిలాదున్ నబి పండుగను జరుపుకుంటారని వారు తెలిపారు. అనంతరం ఆయా మజీద్లలో ప్రతేక దువ్వా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు మానవత్వానికి

# మార్గదర్శకం..



**చేవెళ్ల, (సింగిడి):** ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపిన ప్రేమ, కరుణ, సోదరభావం సమాజానికి ఆదర్శమని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా బుధవారం చేవెళ్లలో మైనార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, పట్నం మ హేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం, మదర్స విద్యార్థులకు పండ్లు అందజేశారు. పేదలకు సహాయం చేస్తూ మానవత్వాన్ని చాటాలని, శాంతి, మత సామరస్యం, సోదరభావాన్ని బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ మున్సిపల్ కో. ఆప్షన్ మెంబర్ ఫరీన్ ఖదీర్ పాషా, ఇబ్రహీంపల్లి మాజీ ఉప సర్పంచ్, బిఆర్ఎస్ మండల మైనార్టీ నాయకులు మహమ్మద్ జాహేద్, కో. ఆప్షన్ మెంబర్ చాంద్ పాషా, ఉర్దూ రిపోర్టర్ సిరాజుద్దీన్, చోటు, మైనార్టీ నాయకులు అబ్దుల్ ఘని, ఖలేద్, ఫైమీద్, నాహేద్, హాజీ, నజీమ్, అక్బర్, రఫీ, నవీద్, జమ్మూ, సలీం, ఖాజా పాషా, రెహమాన్, కాంగ్రెస్ ఫయాజ్, మసరత్, ఇస్మాయిల్, రియాజ్, రఫీఖ్, హామీద్ షరీఫ్, ఖాజా, మైనార్టీ యువకులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే

# పచ్చదనం సాధ్యం

ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, (సింగిడి):** పచ్చదనం పెంపొందించ డంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో వనమహోత్సవం నిర్వహిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చెట్ల పెంపకంతో స్వచ్ఛమైన గాలి, పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చని చేవెళ్లను నిర్మించగలమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో

# పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, (సింగిడి):** మల్కాజిగిరి డివిజన్ ఆనంద్ బాగ్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకొని, అభిషేకం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణ అధికారి రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదవ్, చంద్ర మౌళి, ప్రభాకర్ గౌడ్, నర్సింగ్, మల్లేష్ యాదవ్, కేబుల్ రమేష్, శ్రీకాంత్, నవీన్, సురేష్, బాలకృష్ణ, ఉమేష్, ఉమాపతి, సూర్యకుమారి, వైశాలి, గౌస్ ఇమ్రాన్, నర్సింగ్ రావు, ఆలయ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ వేడుకలు



**ఆమనగల్లు, (సింగిడి):** గిరిజనుల సంస్కృతికిసాంప్రదాయానికి ప్రతీక అయిన తీజ్ వేడుకలను బుధవారం కడ్తాల మండల కేంద్రంలోని మైసిగండి లో ఘనంగా జరుపుకున్నారు. ఈ తీజ్ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వారి బంధువులు భారీగా తరలిరావడంతో మైసిగండి కేంద్రం జనసంద్రంతో నిండిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు తీజ్ వేడుకలు గిరిజనుల సంప్రదాయ పద్ధతిలో కొనసాగాయి. చిన్నారులు మొదలు వృద్ధుల వరకు గిరిజనులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. గిరిజన యువతులు తమ ఆచారం ప్రకారం ప్రజాప్రతినిధులకు తీజ్ మొలకలను అందజేసి తీజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో యువతీయువకులు నృత్యాలు చేశారు. తొమ్మిది రోజులపాటు



పూజలు చేసి వేయించిన మొలకల బుట్టలను ఆలయంలో ఉంచారు. అనంతరం పెళ్లి కాని యువతులు,చిన్నారులు పట్టు వస్త్రాలు ధరించి డీజే సౌండ్ లతో గిరిజన సాంప్రదాయ నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు.. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే వంశీ చంద్ రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, టిపిసిసి సభ్యుల శ్రీనివాస్ గౌడ్,,ఆర్ పిజ్యోతి,డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బిక్యానాయక్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, చెగురివెంకటేష్,మండల అధ్యక్షుడు శంకర్,సర్పంచులు ప్రేమజవహలాల్ నాయక్,రాయికంటి బిక్షపతి, మహేందర్గౌడ్,డిగ్రీ కృష్ణ,చెన్నకేశవులు పాల్గొన్నారు

























మాజీ సర్పంచ్ లక్ష్మమ్మకు

# నివాళులర్పించిన పట్నం అవినాష్ రెడ్డి

**చేవెళ్ళ (సింగిడి):** చేవెళ్ళ నియోజకవర్గం షాబాద్ మండలంలోని రుద్రారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ గొల్లగూడెం లక్ష్మమ్మ కు షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి నివాళులర్పించారు. బుధవారం రుద్రారం గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు ప్రస్తుత సర్పంచ్ యాదిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, సంజీవరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులున్నారు..



అంత్యక్రియలకు మాతా రమాబాయి

# అంబేద్కర్ కమిటీ ఆర్థిక సాయం

**కొడంగల్, (సింగిడి):** కొడంగల్ పట్టణంలోని 12వ వార్డు కు చెందిన కర్రె శకనమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాతా రమాబాయి అంబే ద్కర్ కమిటీ మహిళలు తమవంతుగా మృతురాలి కుటుం బానికి చేయూతనివ్వాలని భావించి మహిళల సహకారంతో 20,100 రూపాయలు మృతురాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించి, మృతదేహానికి పూలదండ లు వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్రమంలో ఆర్థిక సాయం అందించిన మాతా రమాబాయి అంబేద్కర్ కమిటీ సభ్యులు మల్లమ్మ, శోభా, శిరీష, అంజమ్మ, అమృతమ్మ, కవిత, కృష్ణవేణి, శాంతమ్మ, సరస్వతి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.



# శేరిపల్లిలో ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదులు

**శ్రీరంగాపూర్ (సింగిడి):** శ్రీరంగాపురం మండలం శేరిపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తుల సహకారంతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పాఠశాలలో ఐదు తరగతులకు 120 మంది విద్యార్థులు ఉండగా, కేవలం రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యను హెచ్ఎం, ఉపాధ్యాయులు గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన గ్రామ ఉద్యోగులు, ప్రజలు రూ. 1.90 లక్షలు సమకూర్చి రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేశారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో తరగతి గదుల కొరత తీరడంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కలగనుంది.



# ప్రజల అవసరాలే ప్రాధాన్యం.. అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, (సింగిడి):** ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ చేవెళ్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ 15వ వార్డులో బుధవారం కౌన్సిలర్ బండారిశైలజ ఆగిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతవెంకట్‌రెడ్డితో కలిసి దండు మాణెమ్మ నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ప్రతి వార్డులో అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది. క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.



# విడుదలకు ముందే టాక్సిక్ రికార్డులు



యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ. 21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ. 30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతు న్నాయి. అక్కడ ఇప్పటికే రూ. 10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ. 1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది.

## వారణాసిపై మరో సంచలన వార్త

### వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ అర్టిస్ట్‌లు

దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ. 1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ పక్రియను డిజైన్ చేస్తున్నారట.

## 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి




రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. ÷-లకైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి' అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.

## రాకాలో ఐశ్వర్యలక్ష్మి నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

సినిమా సింగిడి
Cinma Singidi

గురువారం
27-8-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737